1St
Happy Work Anniversary.
Year

షణ్ముఖ
SHANMUKHAVELUGU
# వెలుగు
RNI : APTEL / 2023 / 89152
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక

Good for Health
Best for Readers
THE POWER OF RK PEN

సంపుటి : 2 సంచిక : 246 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ శుక్రవారం 08 ఆగస్టు 2025 పేజీలు 8 : వెల 3/-ఒంగోలు

VOLUME : 02 ISSUE : 246 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE Friday 08 August 2025 PAGES : 8 PRICE : 3/-

# అమరావతిలో హ్యాండ్లూమ్ మ్యూజియం ఏర్పాటు చేస్తాం



(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఆగస్టు 07)
భారతీయ శక్తి, సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక చేనేతలు అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. గుంటూరు జిల్లా మంగళగిరిలో ఏర్పాటు చేసిన 11వ జాతీయ చేనేత దినోత్సవంలో సీఎం పాల్గొన్నారు. అమరావతిలో హ్యాండ్లూమ్ మ్యూజియం ఏర్పాటు చేస్తామని తెలిపారు. "నైపుణ్యం, సృజనాత్మకత కలయిక చేనేతలు. తెలుగుదేశం పార్టీకి నేతన్నలకు అవినాభావ సంబంధం ఉంది. నేతన్నలకు ఉపాధి కల్పించిన నేత ఎన్టీఆర్. వ్యవసాయం తర్వాత అధికంగా ఉపాధి కల్పించేది వస్త్ర పరిశ్రమ. 55,500 మంది చేనేత కార్మికులకు రూ.2లక్షలు చొప్పున రూ.27కోట్లు -మిగతా 2లో




## నేత కార్మికులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుంది మంత్రి లోకేశ్



(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఆగస్టు 07)
భారతీయ సాంస్కృతిక వారసత్వానికి ప్రతీక చేనేత అని ఏపీ విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేశ్ తెలిపారు. మన చేనేత సోదరులు నేసిన వస్త్రాలు ప్రపంచ వ్యాప్తంగా పేరు గడించాయని వెల్లడించారు. వ్యవసాయం తర్వాత వేలాది మందికి ఈ రంగం ఉపాధి కల్పిస్తోందన్నారు. అలాంటి రంగానికి అండగా నిలిచేందుకు కూటమి ప్రభుత్వం నేటి నుంచి ప్రతి చేనేత కార్మికుడి కుటుంబానికి నెలకు 200 యూనిట్లు, మర మగ్గాలకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించనుందని పేర్కొన్నారు.

చేనేత వస్త్రాలపై జీఎస్టీ భారాన్ని భరించనుందన్నారు. నేత కార్మికులకు కూటమి ప్రభుత్వం ఎప్పుడూ వెన్నంటి నిలుస్తోందని స్పష్టం చేశారు. చేనేత కళాకారులందరికీ జాతీయ చేనేత దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

## సుంకాలపై అమెరికా వితండ వాదన

(షణ్ముఖ వెలుగు,ఢిలీ,ఆగస్టు 07)
భారత్ భారీగా సుంకాలు విధిస్తోందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భూతద్దంలో చూపిస్తున్నట్లు స్పష్టమవుతోంది. విదేశీ ఉత్పత్తులపై భారత్ విధిస్తున్న సాధారణ సగటు సుంకం 15.98%. ప్రపంచ బ్యాంకు గణాంకాల ప్రకారం.. మనం విధిస్తున్న వాణిజ్య ఆధారిత సగటు సుంకం 4.6 శాతమే. సాధారణ సగటు సుంకం ప్రాతిపదికన భారత్‌ను ట్రంప్ విమర్శిస్తున్నట్లు వాణిజ్య వర్గాలు భావిస్తున్నాయి. సాధారణ సగటు సుంకం కింద బంగ్లాదేశ్ 14.1 శాతం, తుర్కియే 16.2%, అర్జెంటీనా 13.4% వసూలు చేస్తున్నాయి. వాణిజ్య ఆధారిత సగటు సుంకం పలు వర్ధమాన దేశాల కంటే మనవద్ద తక్కువగానే ఉంది. వియత్నాం 5.1%, ఇండోనేసియా -మిగతా 2లో



## రాజీపడే ప్రసక్తే లేదు.. ట్రంప్ టారిఫ్‌ల వేళ మోదీ స్ట్రాంగ్ మెసేజ్

(షణ్ముఖ వెలుగు,ఢిలీ,ఆగస్టు 07)
రష్యా చమురును కొనుగోలు చేస్తుందన్న కారణంతో భారత్‌పై సుంకాలను రెట్టింపు చేశారు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్. ఇప్పటివరకు ఉన్న 25శాతం సుంకాలను 50శాతానికి పెంచుతున్నట్లు ప్రకటించారు. ఈ పరిణామాలపై భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ పరోక్షంగా స్పందించారు. రైతుల ప్రయోజనాలపై ఎన్నటికీ రాజీపడే ప్రసక్తే లేదంటూ అమెరికాను ఉద్దేశిస్తూ గట్టిగా బదులిచ్చారు.దివంగత వ్యవసాయ శాస్త్రవేత్త ఎం.ఎస్ స్వామినాథన్ జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని దిల్లీలో -మిగతా 2లో



## సుంకాల ఎఫెక్ట్.. 2047 లక్ష్యాలకు గండి



(షణ్ముఖ వెలుగు,ఢిలీ,ఆగస్టు 07)
భారత్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాల బాదుడుపై ఆర్‌బీఐ మాజీ గవర్నర్, ఆర్థిక వేత్త దువ్వూరి సుబ్బారావు స్పందించారు. దీని ప్రభావం ఇప్పటికిప్పుడు భారత్‌పై ఉండకున్నా.. మధ్యస్థ, దీర్ఘకాలంలో మాత్రం అధిక ప్రభావం ఉంటుందని అభిప్రాయపడ్డారు. రష్యా చమురు కొనుగోళ్లను సాకుగా చూపి భారత్‌పై మరో 25 శాతం సుంకాన్ని విధిస్తున్నట్లు ట్రంప్ ప్రకటించిన నేపథ్యంలో ఆయన ఈ అంశంపై ఓ ఆంగ్ల పత్రికతో మాట్లాడారు. "భారత జీడీపీలో ఎగుమతుల వాటా 22 శాతంగా ఉంది. మొత్తం ఎగుమతుల్లో అమెరికా వాటా 17 శాతం. భారత్ ఉత్పత్తులపై 50 శాతం టారిఫ్ వల్ల జీడీపీపై 50 బేసిస్ పాయింట్ల ప్రభావం పడే అవకాశం ఉంది. జీడీపీ వృద్ధి రేటు 50 బేసిస్ పాయింట్ల మేర నెమ్మదించి 6 లేదా 6.1 శాతంగా నమోదు కావొచ్చు. అయితే, వేగంగా వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ కావడం వల్ల 50 బేసిస్ పాయింట్లను కోల్పోవడం అనేది పెద్ద లెక్క కాదు. ఏడాది పాటు ఈ భారాన్ని భారత్ మోయగలదు. ఏడాదికి మించితే మాత్రం 50 బేసిస్ పాయింట్ల భారం అనేది భారత లక్ష్యాలపై ప్రభావం చూపుతుంది. 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశాల సరసన నిలవాలన్న వికసిత భారత్ లక్ష్యాలకు ఇది ఆటంకంగా మారొచ్చు" అని వ్యాఖ్యానించారు.

అలాగే, అమెరికా టారిఫ్‌ల వల్ల ఎకానమీ కంటే కూడా చిన్న ఆదాయ వర్గాలపై ఎక్కువ ప్రభావం -మిగతా 2లో

## యువత వారానికి ఒక్కసారైనా చేనేత వస్త్రాలు ధరించాలి

**జాతీయ చేనేత దినోత్సవంనాడు నేతన్నలకు శుభాకాంక్షలు తెలిపిన పవన్**

**చేనేత మగ్గాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్**

**మరమగ్గాలకు 500 యూనిట్ల దాకా కరెంట్ ఫ్రీ**

**ఆప్కో కొనుగోళ్లపై 5 శాతం జీఎస్టీ రాయితీ**

**నేతన్నల కోసం త్రిఫ్ట్ ఫండ్ ఏర్పాటుకు నిర్ణయం**



(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఆగస్టు 07)
జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నేత కార్మికులకు శుభవార్త చెప్పింది. చేనేత రంగానికి అండగా నిలుస్తూ పలు కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వెల్లడించారు. ఇందులో భాగంగా చేనేత మగ్గాలకు 200 యూనిట్లు, మరమగ్గాలకు -మిగతా 2లో

## అమెరికాపైనా ప్రతీకార సుంకాలు విధించాలి: శశిథరూర్

(షణ్ముఖ వెలుగు,ఢిలీ,ఆగస్టు 07)
రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్నారనే కారణంతో భారత్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 50శాతం సుంకాలు విధించడాన్ని కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ తీవ్రంగా తప్పుబట్టారు. అమెరికా దిగుమతులపై కూడా భారత ప్రభుత్వం అలాంటి చర్యలే తీసుకోవాలన్నారు. గురువారం పార్లమెంటు వెలుపల ఆయన మీడియాతో మాట్లాడారు.

అమెరికా విధించిన సుంకాలు మనపై కచ్చితంగా ప్రభావం చూపిస్తాయన్నారు. దాదాపు 90 బిలియన్ డాలర్ల మేర ఎగుమతులు జరుగుతున్నాయన్నారు. సుంకం ఎక్కువగా ఉన్నప్పుడు భారత్ వస్తువులు ఎందుకు కొనాలి అని కొనుగోలుదారులు కూడా ఆలోచిస్తారన్నారు. రష్యా నుంచి భారత్ కంటే చైనా ఎక్కువ చమురు కొనుగోలు చేస్తోందని.. కానీ, ఆ దేశానికి ట్రంప్ సుంకాల నుంచి 90 రోజుల ఉపశమనం కల్పించారన్నారు. మనకు మాత్రం మూడు వారాలే ఉపశమనం కల్పించడం సమంజసం కాదన్నారు. కేంద్రం కూడా యూఎస్ దిగుమతులపై 50శాతం సుంకం విధించాలని కోరారు. మరే దేశం కూడా మనపై ఇలా బెదిరింపులకు దిగకూడదన్నారు. ఇప్పటికే భారత్‌పై 25శాతం సుంకాలు విధించిన ట్రంప్ దాన్ని 50శాతానికి పెంచారు. అంతకుముందు ప్రకటించిన పాత 25శాతం సుంకాలు -మిగతా 2లో



## పుతిన్ భారత్ పర్యటన.. ప్రోత్సాహకాలు లభించేనా?



(షణ్ముఖ వెలుగు,ఢిలీ,ఆగస్టు 07) రష్యా పర్యటనలో ఉన్న జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డోభాల్ ఆసక్తికర ప్రకటన చేశారు. ఆ దేశ అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఈ ఏడాది చివర్లో భారత్ పర్యటనకు రానున్నట్లు తెలిపారు. సుంకాలు అమాంతం పెంచేస్తూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారత్‌ను ఇబ్బంది పెట్టేందుకు ప్రయత్నిస్తున్న వేళ పుతిన్ భారత్ పర్యటనకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం ప్రాధాన్యత సంతరించుకుంది. పుతిన్ భారత్ పర్యటనతో చమురు కొనుగోలులో కీలక ప్రోత్సాహకాలు లభించే అవకాశముంది.

రష్యా నుంచి భారత్ చమురు కొనుగోను చేయడం మింగుడు పడని ట్రంప్.. గత కొన్నాళ్లుగా సుంకాల పేరిట భారత్‌ను భయపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. అయితే, చిరకాల మిత్రుడు రష్యాతో సంబంధాలను బలహీనపరచుకోవడం ఇష్టం లేని భారత్ ఇదే విషయాన్ని స్పష్టం చేసింది. ఈ తరుణంలో మరిన్ని ప్రోత్సాహకాలు ప్రకటించి, ఇరుదేశాల ద్వైపాక్షిక సంబంధాలను రష్యా బలోపేతం చేసుకునే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. ప్రధానంగా.. చమురు కొనుగోలుతో పాటు, వివిధ అంశాలపై ఇరుదేశాల మధ్య కీలక ఒప్పందాలు జరిగే అవకాశం ఉన్నట్లు అజిత్ డోభాల్ మాటల్లో తెలుస్తోంది.

ఇప్పటికే రష్యా నుంచి భారత్ పెద్ద మొత్తంలో ముడి చమురు కొనుగోలు చేస్తోంది. ఒకవేళ ప్రోత్సాహకాలకు -మిగతా 2లో

## ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుకు కృతజ్ఞతలు తెలిపిన ఆలయ అర్చకులు





(షణ్ముఖ వెలుగు, కందుకూరు, ఆగస్టు 7)

కందుకూరు పట్టణ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గురువారం సాయంత్రం లింగసముద్రం మండలం చినపవని గ్రామంలో వెలిసియున్న శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ధూప దీప నైవేద్యముల కొరకు నిధులు మంజూరు చేసిన సందర్భంగా అర్చకులు పి. రమణాచార్యులు కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుని ఆలయ కమిటీ సభ్యులతో కలిసి కృతజ్ఞతలు తెలిపి ఘనంగా శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సోంపల్లి మనోహర్, దామా కొండపనాయుడు, మాధవరపు మహేశ్వరరావు, వెల్ల వెంకటేశ్వర్లు, ఉమ్మనేని కృష్ణారావు, గుర్రం మాలకొండయ్య పాల్గొన్నారు.

## దివ్యాంగుల విద్యార్థులకు వీల్ చైర్స్ పంపిణీ



(షణ్ముఖ వెలుగు , కనిగిరి, ఆగస్టు 7)

రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర శిక్ష కేంద్రం ద్వారా దివ్యాంగుల విద్యార్థులకు భవిత కేంద్రం ఆధ్వర్యంలో వీల్ చైర్స్ అందజేయడం జరిగిందని మండల విద్యాశాఖ అధికారులు జీ.సంజీవి, ఆర్.శ్రీనివాసులు తెలిపారు. గురువారం మండల కేంద్రమైన పీసీ పల్లి గోపవరపు వారి పల్లెలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలోని దివ్యాంగుల విద్యార్థులకు ప్రభుత్వం అందజేసిన పరికరాలను పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఎంఈఓ లు మాట్లాడుతూ భవిత కేంద్రాలలో ఐఆర్పీలు ఆధ్వర్యంలో దివ్యాంగు విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్య, ఫిజియోథెరపీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని అన్నారు. తల్లిదండ్రులు విద్యార్థిని, విద్యార్థులను ప్రతిరోజు క్రమం తప్పకుండా పాఠశాలకు పంపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐఆర్పీలు పగిడి నాగేశ్వరరావు,గురిజాల శ్వేషిక, ఉపాధ్యాయులు గురువారెడ్డి, విద్యార్థుల తల్లిదండ్రులు తతితరులు పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి

### అమరావతిలో

## హ్యాండ్లూమ్ మ్యూజియం ఏర్పాటు చేస్తాం



రుణాలు ఇచ్చాం. 90,765 కుటుంబాలకు 100 యూనిట్లు కరెంటు ఉచితంగా ఇచ్చాం.

చేనేత కార్మికులకు తొలిసారిగా 50ఏళ్లకే పింఛన్ ఇవ్వాలని నిర్ణయించాం. చిన్న వయసులోనే అనారోగ్యం పాలవుతున్న పరిస్థితి.. అందుకే 50 ఏళ్లకే పింఛన్ తీసుకొచ్చాం. 50శాతం సబ్సిడీతో మర మగ్గాలకు రూ.80కోట్లు ఖర్చు పెట్టాం. ఈ నెల నుంచే 200యూనిట్ల విద్యుత్ ఉచితంగా ఇస్తామని హామీ ఇస్తున్నాం. మరమగ్గాలకు 500 యూనిట్ల విద్యుత్ ఉచితంగా ఇస్తాం. ఉచిత విద్యుత్ వల్ల 93 వేల కుటుంబాలకు లబ్ధి కలుగుతుంది. చేనేతలకు ఎంత ఇచ్చినా తక్కువే అవుతుంది" అని చంద్రబాబు అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు నారా లోకేశ్, సవిత, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## సుంకాలపై అమెరికా వితండ వాదన

5.7%, ఈయూ 5% మేర ఈ సుంకాన్ని వసూలు చేస్తుండటం గమనార్హం. బాగా అభివృద్ధి చెందిన స్విట్జర్లాండ్ (28.5%), నార్వే (31.1%), దక్షిణ కొరియా (57%) కూడా విదేశీ వ్యవసాయ ఉత్పత్తులపై భారత్‌ను మించి సుంకాలు విధిస్తున్నాయి.

అమెరికా నుంచి భారత్ భారీగా ఔషధ/ ఇంధన ఉత్పత్తులు, యంత్రాలు, రసాయనాలను దిగుమతి చేసుకుంటోంది. వీటిపై 5 నుంచి 8 శాతమే సుంకాలు విధిస్తున్నారు.

**ఇతర దేశాల నుంచి తీసుకుంటే మోతే**

భారత్ ఒకవేళ ఇతర దేశాల నుంచి చమురును దిగుమతి చేసుకోవాలని భావిస్తే.. తలకు మించిన భారంగా పరిణమించడం ఖాయం. ఆయా దేశాలు అధిక ధరలను వసూలు చేస్తాయి. అప్పుడు భారం వినియోగదారులపైకి మళ్లుతుంది. ఇప్పటికే అధికంగా ఉన్న పెట్రో ధరలు మరింత పెరుగుతాయి. రష్యా ముడి చమురువల్లే 2023లో భారత్.. 86.28 బిలియన్ డాలర్ల ఆదాయాన్ని ఆర్జించింది. విచిత్రంగా రష్యా చమురు ఉత్పత్తులను భారత్ నుంచి కొనుగోలు చేసే దేశాల్లో అమెరికా, ఐరోపా దేశాలున్నాయి.

## రాజీపడే ప్రసక్తే లేదు.. ట్రంప్ టారిఫ్‌ల వేళ మోదీ స్ట్రాంగ్ మెసేజ్

నిర్వహించిన కార్యక్రమానికి ప్రధాని మోదీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అమెరికాతో వాణిజ్యం, టారిఫ్‌ల అంశాన్ని పరోక్షంగా ప్రస్తావించారు. "రైతుల సంక్షేమమే మాకు అత్యంత ప్రాధాన్యం. రైతులు, మత్స్యకారులు, పాడి రైతుల ప్రయోజనాలకు సంబంధించిన విషయాల్లో ఎన్నటికీ రాజీపడబోం. అలా చేయడం వల్ల మేం భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని మాకు తెలుసు. రైతుల ప్రయోజనాలను కాపాడటం కోసం వ్యక్తిగతంగా ఎంత చెల్లించేందుకైనా నేను సిద్ధమే. భారత్ సిద్ధమే" అని మోదీ వ్యాఖ్యానించారు.

భారత్‌పై ఇప్పటికే 25 శాతం సుంకాలు విధించిన ట్రంప్ . తాజాగా దాన్ని 50 శాతానికి పెంచిన సంగతి తెలిసిందే. అంతకుముందు ప్రకటించిన పాత 25శాతం సుంకాలు గురువారం నుంచి అమల్లోకి వచ్చాయి. ఇక, కొత్తగా విధించిన అదనపు 25% సుంకాలను ఈ నెల 27 నుంచి అమలు చేస్తామని ట్రంప్ ప్రకటించారు. ఈ టారిఫ్‌లతో భారతీయ వస్త్ర పరిశ్రమ, ఆక్వా రంగం, తోలు ఉత్పత్తులపై వెంటనే ప్రభావం పడనుంది. ముఖ్యంగా రొయ్యలు, జంతు సంబంధ ఉత్పత్తులపై అదనపు భారం పడింది.

మన దేశం నుంచి ఎగుమతి అయ్యే వ్యవసాయ ఉత్పత్తుల పై సుంకాలు తగ్గించాలని అమెరికా చాలాకాలంగా డిమాండ్ చేస్తోంది. అందుకు ఆమోదిస్తే.. దేశంలోని రైతుల ప్రయోజనాలు దెబ్బతింటాయనే ఆందోళన ఉంది. ఇది రాజకీయంగా సున్నితమైన అంశం అయినందున.. వ్యవసాయ ఉత్పత్తులపై సుంకం మినహాయింపునకు భారత్ ససేమిరా అంది. గతంలోనూ ఈ విషయంపై ఇరు దేశాల మధ్య పలుమార్లు చర్చలు జరిగినా ఏకాభిప్రాయం కుదరలేదు. దీంతో అగ్రరాజ్యం ఆగ్రహించినట్లు తెలుస్తోంది. మరోవైపు, రష్యా నుంచి న్యూదిల్లీ చమురు కొనుగోలును కూడా అమెరికా తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ఈ నేపథ్యంలోనే భారత్‌పై సుంకాలను రెట్టింపు చేసింది.

## పుతిన్ భారత్ పర్యటన.. ప్రోత్సాహకాలు లభించేనా?

సంబంధించిన ఒప్పందాలు కార్యరూపం దాల్చితే.. కొనుగోలు పరిమాణం మరింత పెరుగుతుంది. అదే సమయంలో అమెరికా సుంకాలను మరింత పెంచే అవకాశం ఉంది. అందువల్ల మోదీ ప్రభుత్వం అటు అమెరికాను, ఇటు రష్యాను దూరం చేసుకోకుండా తన విదేశాంగ విధానాన్ని సమతుల్యం చేసుకోవాల్సిన అవసరం ఉంది. అంతేకాకుండా జాతీయ ప్రయోజనాలు, ఆర్థిక భద్రత గాడి తప్పకుండా చూసుకోవాలి. అగ్రరాజ్యం సుంకాల మోత మోగించకుండా ఉండాలంటే భారత్ చాకచక్యంగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది. రష్యా, ఉక్రెయిన్ దేశాలతో భారత్‌కు సత్సంబంధాలు ఉన్నాయి. అందువల్ల కాల్పుల విరమణకు తనవంతు కృషి చేయాలి. ఒకవేళ అది సాధ్యమైతే.. అమెరికా సుంకాలు భారాన్ని తగ్గించే అవకాశాలు లేకపోలేదు.

## యువత వారానికి ఒక్కసారైనా చేనేత వస్త్రాలు ధరించాలి

500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించనున్నట్లు ఆయన ప్రకటించారు.

గురువారం జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా పవన్ కల్యాణ్ స్పందిస్తూ, చేనేత కళ మన దేశ సంస్కృతికి, స్వాతంత్ర్య స్ఫూర్తికి ప్రతీక అని కొనియాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో జరిగిన కేబినెట్ సమావేశంలో చేనేత రంగానికి లబ్ధి చేకూర్చేలా ఈ నిర్ణయాలు తీసుకున్నట్లు తెలిపారు. ఉచిత విద్యుత్ పథకంతో పాటు, చేనేత సొసైటీల నుంచి ఆప్కో కొనుగోలు చేసే వస్త్రాలపై 5 శాతం జీఎస్టీ రాయితీ ఇవ్వాలని కూడా ప్రభుత్వం నిర్ణయించిందని వివరించారు. దీనితో పాటు, కార్మికులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు త్రిఫ్ట్ ఫండ్ ఏర్పాటు చేయనున్నట్లు స్పష్టం చేశారు.

కూటమి ప్రభుత్వం చేనేత రంగానికి అన్ని విధాలుగా ఊతమిస్తుందని ఆయన భరోసా ఇచ్చారు. చేనేత వస్త్రాల వాడకాన్ని పెంచేందుకు ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు చేపడతామని అన్నారు. రాష్ట్రంలోని యువత వారానికి ఒక్కరోజైనా చేనేత వస్త్రాలు ధరిస్తే, ఆ రంగంపై ఆధారపడిన వారికి ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. అసంఘటిత రంగాలలో కీలకమైన చేనేతను ఆదుకోవడం ప్రభుత్వ బాధ్యత అని ఆయన పేర్కొన్నారు.

## అమెరికాపైనా ప్రతీకార సుంకాలు విధించాలి శశిథరూర్

గురువారం నుంచి అమల్లోకి వచ్చాయి. కొత్తగా విధించిన 25శాతం టారిఫ్‌లు ఈనెల 27 నుంచి అమల్లోకి రానున్నాయి. భారతీయ వస్త్ర పరిశ్రమ, ఆక్వా రంగం, తోలు ఉత్పత్తులపై ఇది వెంటనే ప్రభావం చూపనుంది. ట్రంప్ విధించిన సుంకాలపై ప్రధాని మోదీ మాట్లాడుతూ.. రైతుల ప్రయోజనాలపై ఎన్నటికీ రాజీపడే ప్రసక్తే లేదన్నారు. రైతుల ప్రయోజనాలను కాపాడటం కోసం వ్యక్తిగతంగా ఎంత చెల్లించేందుకైనా సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.

## సుంకాల ఎఫెక్ట్.. 2047 లక్ష్యాలకు గండి

ఉంటుందన్నారు. అదే సమయంలో రష్యా నుంచి కాకుండా సౌదీ అరేబియా వంటి దేశాల నుంచి చమురు కొనుగోళ్లు జరిపితే ద్రవ్యోల్బణం పెరుగుతుందని, దీనివల్ల పెద్ద సంఖ్యలో తక్కువ ఆదాయం గల కుటుంబాలపై ప్రభావం పడుతుందన్నారు. తద్వారా మొత్తం ఆర్థిక వ్యవస్థ ప్రభావితం అవుతుందన్నారు. మరోవైపు అమెరికాతో వాణిజ్యం విషయంలో ముందు ఏం జరుగుతుందనే దానితో సంబంధం లేకుండా వివిధ దేశాలకు మన ఎగుమతులను పెంచుకోవాల్సిన అవసరం ఉందని దువ్వూరి సుబ్బారావు అభిప్రాయపడ్డారు. మరిన్ని దేశాలతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకోవాల్సి ఉందని, దేశంలో మరిన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు.

### ఒకరు మృతి ముగ్గురికి గాయాలు
### అవులను తప్పించబోయి ఆటో బోల్తా

## జంగంగుంట్ల వద్ద రోడ్డు ప్రమాదం









(షణ్ముఖ వెలుగు, కంభం, ఆగస్టు 7)

కంభం మండలం జంగంగుంట్ల సమీపంలో రోడ్డు ప్రమాదం జరిగింది. కంభం నుండి జంగంగుంట్లకి ప్రయాణికులు ఆటోలో వెళుతుండగా జంగంగుంట్ల సమీపంలో ఆవులు అడ్డురాగా ఆవులను తప్పించబోయి ప్రమాదం జరిగింది. ప్రమాదంలో జంగంగుంట్ల వాసి దూదేకుల సిద్దమ్మ (67)మృతి చెందింది. అదేగ్రామానికి చెందిన మరో ఇద్దరు ఆటో డ్రైవర్‌తో మొత్తం నలుగురు ప్రయాణిస్తుండగా ప్రమాదం జరిగింది. దూదేకుల సుబ్బమ్మ అనే మహిళ నంద్యాల ఆసుపత్రి కి వెళ్లి వైద్యం చేయించుకొని కంభం నుండి జంగంగుంట్ల కి ఆటోలో వెళుతూ ప్రమాదం జరగగా వెంటనే వైద్యం కోసం ఒంగోలు ఆసుపత్రికి తీసుకొని వెళ్లే క్రమంలో మార్గ మధ్యంలో మృతిచెందింది. మృతి చెందిన దూదేకుల సిద్దమ్మను పోస్టుమార్టం కోసం కంభం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొని వచ్చారు. మిగతా ముగ్గురికి గాయాలు కాగా, స్థానికులు కంభం ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు.కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేపట్టారు.



**సీఎంఆర్‌ఎఫ్ ద్వారా రికార్డ్ స్థాయిలో ప్రజలకు ఆర్థిక సాయం**

ఏడాదిలో ప్రజలకు రూ.400 కోట్ల పంపిణీ

ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్

4


షణ్ముఖ వెలుగు

ప్రతి వార్త వెలుగు వైపు — తెలుగు దినపత్రిక

ప్రకాశం


# పొగాకు, శనగ రైతుల సమస్యలు పరిష్కరిస్తాం

ఒంగోలు గిత్త జాతిపై ప్రత్యేక దృష్టి

రాహుల్ గాంధీ వ్యాఖ్యలపై మండిపాటు

గత ప్రభుత్వ అక్రమాలపై విచారణ జరుగుతుంది

అట్టహాసంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ జిల్లా పర్యటన







(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 7)

ప్రకాశం జిల్లాలో అత్యధికంగా ప్రతి ఒక్కరు వ్యవసాయంపైనే ఆధారపడి ఉన్నారని, రైతుల ఇబ్బందులు, కష్టాలు తీర్చే విధంగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ అన్నారు. బీజేపీ అధ్యక్షులుగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం సారథ్యం పేరుతో జిల్లాల పర్యటన చేపట్టిన మాధవ్.. బుధవారం ప్రకాశం జిల్లాలో పర్యటించారు. జిల్లాలో ఆయన పర్యటన అంగరంగ వైభవంగా సాగింది. కార్యకర్తలు, నాయకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన ఒంగోలులో నిర్వహించిన అనేక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ముందుగా ఛాయ్ పే చర్చ లో పాల్గొన్నారు . స్థానిక ఛాయ్ దుకాణం వద్ద ప్రజలతో మాట్లాడారు. పొగాకు రైతులు, ఆక్వా రైతులు, శనగ రైతులు, ప్రజలు వారి సమస్యలను మాధవ్ దృష్టికి తీసుకొచ్చారు. కర్ణాటకలో మాదిరిగా పొగాకు పంటపై ఫైన్ లు ఎత్తివేయాలని రైతులు ఆయనను కోరారు. ట్రంప్ వేస్తున్న అధిక టారిఫ్ ల వల్ల ఆక్వా రైతులు నష్టపోతున్నారని, శనగకు కూడా గిట్టుబాటు ధర లేకుండా ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. దీనిపై స్పందించిన మాధవ్ గతంలో పొగాకు పంటపై అధిక లాభాలు రావడంతో ఈ ఏడాది అందరూ అధికంగా పండించడం వల్ల ఇబ్బందులు వచ్చాయన్నారు. కర్ణాటక తరహాలో మన రాష్ట్రంలో కూడా అపరాద రుసుం ఎత్తేసి, మొత్తం పొగాకు కొనే విధంగా చూస్తామని చెప్పారు. ట్రంప్ వేస్తున్న సుంకాలపై కూడా ఆయన మాట్లాడారు. ఆక్వా రైతులు వనామ రకం మాత్రమే కాకుండా వేరే కల్చర్లు కూడా రైతులు చేపట్టాలని ఆయన సూచించారు. శనగకు కూడా గిట్టుబాటు ధర వచ్చేలా చేస్తామని హామీ ఇచ్చారు.

**కార్యకర్తలతో సమావేశం...**

పర్యటనలో భాగంగా ఛాయ్ పే చర్చలో పాల్గొన్న అనంతరం మాధవ్ ప్రకాశం పంతులు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక పాత కూరగాయల మార్కెట్ వద్ద నుంచి, ఎంఎస్ ఆర్ ఫంక్షన్ హాల్ వరకు కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యకర్తలు పెద్ద ఎత్తున శోభాయాత్రలో పాల్గొని రాష్ట్ర అధ్యక్షులు మాధవ్ కి గజమాలతో ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కార్యర్తలు, పార్టీ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని భారత్ మాతాకీ జై అంటూ నినాదాలు చేశారు. వారి నినాదాలతో, అడుగడుగున బీజేపీ జెండాలతో ఒంగోలు నగరం కాషయవనంగా, కోలాహలంగా మారింది. (తరువాయి 4లో...)

## ప్రతి నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలి

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె విజయానంద్



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 7)

రాష్ట్రంలో ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటుచేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. గురువారం సాయంత్రం విజయవాడ ఏపీ సచివాలయంలోని సి.ఎస్ కాన్ఫరెన్స్ హాల్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, జిల్లా కలెక్టర్లతో వర్చువల్ గా సమావేశమై పీ4 కార్యక్రమం అమలు, అసెంబ్లీ నియోజకవర్గ స్థాయిలో ఎంఎస్ఎంఇ పార్కులు ఏర్పాటు, ముఖ్యమైన ప్రాజెక్టులకు సంబంధించిన భూ సంబంధిత అంశాలు, జిల్లా స్థాయి లాజిస్టిక్ ప్రణాళికలు, జిల్లాల్లో పిపిపి విధానంలో ప్రాజెక్టులు, (తరువాయి 4లో...)

## లిక్కర్ డబ్బుతో గెలిచి... చెక్కర్లు కొడుతున్నావ్

వేలాది మంది ప్రాణాలను తీసి సంపాదించిన ఆ డబ్బు

మీ ఎంపీ అభ్యర్థి జైల్లో ఊసలు లెక్కపెట్టుతున్నాడు

భవిష్యత్తులో నీ పరిస్థితి ఏమిటి ట్విట్టర్ ఎమ్మెల్యే

మా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్‌ను విమర్శించే స్థాయి నీకు లేదు

రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

తాటిపర్తి చంద్రశేఖర్‌కి మాస్ వార్నింగ్ ఇచ్చిన

టీడీపీ వైపాలెం ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్ బాబు




(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం టౌన్, ఆగస్టు7)

యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్‌కి టిడిపిని విమర్శించే స్థాయి లేదు. నకిలీ మద్యం డబ్బుతో గెలిచిన నీవు నోరు అదుపులో పెట్టుకుంటే మంచిదని టిడిపి నియోజకవర్గ ఇంచార్జి గూడూరి ఎరిక్షన్ బాబు హెచ్చరించారు. గురువారం మండలంలోని అమానుగుడిపాడు గ్రామంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతిపక్ష ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ ను ఉద్దేశించి ఘాటైన విమర్శలు చేశారు. ఆయన వైఖరిపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ తాను నియోజకవర్గ ప్రజల తరపున మాట్లాడుతున్నానని ప్రకటించారు. చరిత్ర అంటే మాకు తెలిసినది. నువ్వు మాట్లాడే అర్హత లేదు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చరిత్ర గురించి మాట్లాడే అర్హత నీకు లేదు. చరిత్ర అంటే మా పార్టీది. అభివృద్ధి, సామాజిక న్యాయం, విద్యార్థులకు మేలు చేయడమే మా గమ్యం. లక్షలాది పేద విద్యార్థులకు విద్యా అవకాశాలను కల్పించిన శాసన పరిపాలన టీడీపీది అని గట్టిగా వ్యాఖ్యానించారు.జాగ్రత్త చంద్రశేఖర్ పేట్రేగిపోయి మాట్లాడుతున్నావ్ మీకు ప్రజలు ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వకుండా కాళ్ళు విరగకొట్టారు గుర్తుంచుకో మీ నాయకుడు 5 సంవత్సరాలు తాడేపల్లి ప్యాలెస్ నుండి (తరువాయి 4లో...)

## రీ సర్వే ప్రక్రియ పటిష్టంగా నిర్వహించాలి

జేసీలకు సూచించిన సిసిఎల్ఎ జాయింట్ సెక్రటరీ ప్రభాకర్‌రెడ్డి



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 7)

జిల్లాల్లో చేపడుతున్న రీ సర్వే ప్రక్రియ ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా పటిష్టంగా నిర్వహించాలని సిసిఎల్ఎ జాయింట్ సెక్రటరీ ప్రభాకర్ రెడ్డి, జాయింట్ కల్లెక్టర్లకు సూచించారు. విజయవాడ సీసీఎల్ఏ కార్యాలయం నుంచి గురువారం జిల్లాల్లో చేపడుతున్న రీ సర్వే ప్రక్రియ పురోగతి, పైలెట్ గ్రామ నోటిఫికేషన్ తదితర అంశాలపై జాయింట్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సిసిఎల్ఎ జాయింట్ సెక్రటరీ ప్రభాకర్ రెడ్డి సమీక్ష నిర్వహించి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాల్లో చేపడుతున్న రీ సర్వే ప్రక్రియ ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా పటిష్టంగా నిర్వహించాలని, (తరువాయి 4లో...)



## 20వ తేదీ నుంచి సీపీఐ మహాసభలు








(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, ఆగస్టు 7)

సీపిఐ రాష్ట్ర 28వ మహాసభలో ఈ నెల 20వ తేదీ నుండి 25వ తేదీ వరకు ఒంగోలు పట్టణంలో అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నందున గురువారం కనిగిరి పట్టణంలోని గుజ్జుల యలమందరెడ్డి నగర్, హనీఫ్ నగర్, సుగుణమ్మ హాస్పిటల్ కూడలి వద్ద, పామూరు బస్టాండ్ లోని కామ్రేడ్ గుజ్జుల యలమందరెడ్డి, సరళ దేవి స్థూపాల వద్ద కళాజాత నిర్వహించారు ఈ సందర్భంగా రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి సయ్యద్ యాసిన్, సహాయ కార్యదర్శి పందిటి మోహన్, మండల కార్యదర్శి జి పి రామారావు, సహాయ కార్యదర్శి గులాం హుస్సేన్ రైతు సంఘం నాయకులు గుజ్జుల బాలిరెడ్డి, ఏఐటీయూసీ నాయకులు కాసింఫీరా, ఏఐఎస్ఎఫ్ నాయకులు ఇఫ్రోజ్, ప్రజానాట్యమండలి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఆర్ రామకృష్ణ, ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు చిన్నం పెంచలయ్య, ప్రకాశం జిల్లా మహిళా సమైక్య అధ్యక్షులు అనంతలక్ష్మి ప్రజానాట్యమండలి కళాకారులు శివయ్య గురప్ప ,నాగరాజు, లక్ష్మి, ఓబులమ్మ, తేజ ,సౌందర్య రజిని, సిపిఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కంభంలో రెచ్చిపోతున్న దొంగలు

### ఆర్మీ ఉద్యోగి ఇంట్లో చోరీ

**2 తులల బంగారం, 20తులాల వెండి, రూ.50 వేల నగదు అపహరణ**





(షణ్ముఖ వెలుగు, కంభం, ఆగస్టు 7)

కంభం పట్టణంలో దొంగలు రెచ్చిపోయారు. వెంకటేశ్వర నగర్ లోని ఆర్మీ ఉద్యోగి రవికుమార్‌రెడ్డి ఇంట్లో చోరీ జరిగింది. కుటుంబ సభ్యులతో కలిసి తిరుమల వెళ్లిన సమయంలో ఇంటి తాళం పగలగొట్టి దుండగులు లోపలికి ప్రవేశించారు. బీరువాలు పగలగొట్టి, 2 తులల బంగారం, 20 తులల వెండి, రూ.50 వేల నగదు అపహరించుకెళ్లారు. ఈ ఘటనపై పోలీసులు గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## కంభం చెరువు కట్ట పై తేరాతేజీ పండుగ

### ముస్తాబు అయిన చెరువు కట్ట



(షణ్ముఖ వెలుగు, కంభం, ఆగస్టు 7)

ప్రకాశం జిల్లా కంభం చారిత్రాత్మక కంభం చెరువు కట్టపై శుక్రవారం ఈ నెల 8వ తేదీన తేరాతేజీ (గరిక తొక్కుడు) పండుగను ముస్లింలు జరుపుకోనున్నారు. కంభం పట్టణంతో పాటు రెండు రాష్ట్రల నలుమూలల నుండి ముస్లింలు కుటుంబ సమేతంగా కంభం చెరువు కట్టకు వచ్చి సాయంత్రం వరకు సరదాగా గడుపుతారు. నూతన వధూవరులు పెళ్లినాటి దండలు చెరువు నీళ్లలో వదిలి మొక్కులు తీర్చుకుంటారు. అలాగే పెళ్లి కాని వారు చెరువు కట్టపై గరికని తొక్కుతారు. సందర్శకులు తాకిడితో శుక్రవారం కంభం చెరువు కట్టపై కోలాహలం నెలకొననుంది.

# పొగాకు, శనగ రైతుల సమస్యలు పరిష్కరిస్తాం





అనంతరఫెంఎస్ఆర్ ఫంక్షన్ హాల్ లో కార్యకర్తలతో పివిఎన్ మాధవ్ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. వారికి దిశానిర్దేశం చేశారు. రానున్న రోజుల్లో నామినేటెడ్ పదవులు రాబోతున్నాయని, స్థానిక సంస్థల ఎన్నికల్లో సైతం మూడు పార్టీలు కలిసే పోటీ చేసే దిశగా ముందుగా వెళ్తున్నట్లు చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికలో విజయం సాధించడం ద్వారా క్షేత్ర స్థాయిలో పార్టీని బలోపేతం చేద్దాం అని కార్యకర్తలకు భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రకాశం జిల్లాకు చెందిన కొంతమంది డాక్టర్లు బీజేపీ పార్టీలో చేరారు. పీవీఎన్ మాధవ్ వారికి కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మోడీ ప్రభుత్వం చేస్తున్న మంచి పనులు, అభివృద్ధి చూసి పార్టీలో చేరినట్లు పలువురు వెల్లడించారు.

**వెలుగొండ పూర్తి చేస్తాం...**

ప్రకాశం జిల్లా పర్యటలను విచ్చేసిన మాధవ్ మీడియా సమావేశంలో పలు విషయాలపై మాట్లాడారు. ప్రకాశం జిల్లా కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేశారని అన్నారు. ఈ పర్యటనలో అనేక సమస్యలు తన దృష్టికి వచ్చాయని, వాటికి పరిష్కారం చూపే దిశగా కృషి చేస్తానని ఆయన అన్నారు. ఒంగోలు అభివృద్ధికి ప్రభుత్వం ఎప్పుడూ కట్టుబడి ఉంటుందని ఆయన అన్నారు. కొత్తపట్నం సమీపంలో ఫిషింగ్ హార్బర్ నిర్మాణం కోసం రూ.460కోట్లు కేటాయించారని, రైల్వే స్టేషన్ ని కూడా అమృత్ రైల్వే స్టేషన్ జాబితాలో చేర్చిన కేంద్రం దాన్ని కూడా అభివృద్ధి చేస్తుందని అన్నారు. ఒంగోలు జాతి గిత్తలను కాపాడేందుకు కూడా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ప్రకాశం జిల్లాలో ముఖ్యమైన ప్రాజెక్టుల్లో ఒకటి వెలుగొండ అని దాన్ని కూడా త్వరితగతిన పూర్తి చేసే ప్రయత్నాలు జరుగుతున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఆయన పార్లమెంట్ లో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీపై మండిపడ్డారు. పరిపక్వత లేకుండా మాట్లాడుతున్నాడని అన్నారు. ఎలక్షన్ కమిషన్ పై రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలు నిరాధారమని అన్నారు. రాష్ట్రంలో గత ప్రభుత్వంలో జరిగిన అవినీతిపై కూడా సమగ్ర విచారణ జరుపుతున్నామని, ఎవ్వరినీ వదిలిపెట్టేది లేదని ఆయన అన్నారు. అనంతరం జిల్లా పర్యటనలో భాగంగా పలువురు ప్రముఖులతో మేధావుల సదస్సు నిర్వహించి పలు అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో 20 సూత్రాల అమలు కమిటీ ఛైర్మన్ లంకా దినకర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ నిడమానూరి సూర్య కల్యాణ్ చక్రవర్తి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నారెడ్డి దయాకర్ రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షులు సెగ్గం శ్రీనివాస్,జిల్లా మాజీ అధ్యక్షులు శివ రెడ్డి, ప్రకాశం జిల్లా ఇంచార్జ్ పి రవి శంకర్, బాపట్ల జిల్లా ఇంచార్జీ కృష్ణ రెడ్డి మరియు బిజెపి జిల్లా ప్రముఖ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ప్రతి నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలి

పాజిటివ్ పబ్లిక్ పర్సెప్షన్, డాక్యుమెంట్ అప్లోడ్ ఏజెంట్ స్పేస్ తదితర అంశాలపై తదితర అంశాలపై సమీక్షించి దిశానిర్దేశం చేశారు. ఈ వీడియో కాన్ఫెరెన్స్‌కు ఒంగోలు జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా, జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాలక్రిష్ణ, జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేసు, డిఆర్ డిఎ పిడి నారాయణ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాసరావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు, సిపిఓ స్వరూప రాణి, ఎపిఐఐసి అధికారులు తదితర పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి విజయానంద్ మాట్లాడుతూ, రాష్ట్రంలో ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేసేందుకు జిల్లా కలెక్టర్లు ప్రత్యేక శ్రద్ద చుపాలన్నారు. ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గంలోనూ ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటుకు అవసరమైన భూములను గుర్తించాలని, రోడ్లు, పరిశ్రమల ఏర్పాటుకు కావలసిన మౌళిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పేదరిక నిర్మూలనే లక్ష్యంగా చేపట్టిన పి 4 కార్యక్రమం అమలుపై దృష్టి సారించాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ, సేవా కార్యక్రమాలను నూరుశాతం అమలు చేసి ప్రజలనుండి సానుకూల అభిప్రాయాలు కలిగేలా చర్యలు తీసుకోవాలన్నారు.

## లిక్కర్ డబ్బుతో గెలిచి...చెక్కర్లు కొడుతున్నావ్

బయటకు రాలేదని గుర్తు చేశారు.దమ్ముంటే ప్రజలలోకి వెళ్ళండి, ప్రజల వద్దనే తేల్చుకుందాం రండి అంటూ ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ కు సవాల్ విసిరారు.వేలాది మంది ప్రాణాలను తీసి సంపాదించిన లిక్కర్ డబ్బుతో నువ్వు ఇక్కడ గెలిచావు త్వరలోనే అన్ని బట్టబయలు అవుతాయి అంటూ హెచ్చరించారు.నారా లోకేష్ చరిత్ర గురించి మాట్లాడే అర్హత నీకు లేదు చంద్రశేఖర్ – చరిత్ర అంటే మా తెలుగుదేశం పార్టీది.యర్రగొండపాలెంలో రూ.6 కోట్లతో ఎస్సీ బాలికల హాస్టల్, రూ.2 కోట్లతో డిగ్రీ కళాశాల, కోటి రూపాయలతో ఎస్సీ బాలుర హాస్టల్స్ కు కేటాయించాం – మీరు ఏం చేశారు. గత 5 సంవత్సరాల మీ పాలనలో నియోజకవర్గంలో అభివృద్ధి ఏం చేశారంటూ గట్టిగా ప్రశ్నించారు. మీ ప్రభుత్వంలో ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చిన ఇసుకను మీ నాయకులు అమ్ముకొని సొమ్ము చేసుకుని దర్జాగా తిరుగుతున్నారంటూ పేర్కొన్నారు.మా ప్రభుత్వంలో ఎలాంటి అవినీతికి పాల్పడటం లేదని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు చేకూరి సుబ్బారావు, చెవుల అంజయ్య, వేగినాటి శ్రీనివాస్, పయ్యావుల ప్రసాద్, చిట్యాల వెంగళరెడ్డి, కందుల నారాయణరెడ్డి, బివి సుబ్బారెడ్డి, మస్తాన్ వలి, శనగ నారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## రీ సర్వే ప్రక్రియ పటిష్టంగా నిర్వహించాలి

అలాగే నిర్దేశించిన సమయంలో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్లకు సూచించారు. ఒంగోలు కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాల క్రిష్ణ, జిల్లా సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారి గౌస్ బాష తదితరులు పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ ద్వారా రికార్డ్ స్థాయిలో ప్రజలకు ఆర్థిక సాయం

(షణ్ముఖ వెలుగు, అద్దంకి, ఆగస్టు 7)

దేశంలో ఏ రాష్ట్రం చేయని విధంగా ఆంధ్రప్రదేశ్ లో ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ప్రజలకు ఆర్థిక సాయం చేస్తున్నామని ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తెలిపారు. కేవలం ఏడాదిలో సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ.400 కోట్లు పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. గురువారం నాడు బాపట్ల జిల్లా అద్దంకి నియోజకవర్గంలో మంత్రి గొట్టిపాటి పర్యటించారు. నియోజకవర్గంలోని పలువురు కార్యకర్తలను మంత్రి పరామర్శించారు. అనంతరం సంతమాగులూరు మండలంలోని పుట్టవారిపాలెం అతిథి గృహంలో లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు, ఎల్ఓసీలను పంపిణీ చేశారు. 16 మంది లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. రూ.34 లక్షలకు సంబంధించిన ఎల్ఓసీ పత్రాలను అర్హులకు మంత్రి గొట్టిపాటి అందజేశారు.



## కందుకూరు ఏరియా హాస్పిటల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎమ్మెల్యే ఇంటూరి డయాలసిస్ సెంటర్ సిబ్బంది పనితీరు పై ఆగ్రహం







(షణ్ముఖ వెలుగు, కందుకూరు, ఆగస్టు 7)

కందుకూరు పట్టణం లోని ఏరియా హాస్పిటల్‌ను, గురువారం ఉదయం కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని అవుట్ పేషెంట్ విభాగం , అత్యవసర విభాగం, జనరల్ వార్డులు, ప్రసూతి విభాగం తదితర ప్రాంతాలను పరిశీలించారు. అక్కడి రోగులతో స్వయంగా మాట్లాడి వారికి అందుతున్న చికిత్స గురించి వివరాలు తెలుసుకున్నారు. మందుల లభ్యత, ఆహార సరఫరా, పరిశుభ్రత అంశాలపై వారిని అడిగి తెలుసుకున్నారు. వైద్యుల హాజరు పట్టిక, పలు రికార్డులను పరిశీలించి సంబంధిత అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. రోగులకు మెరుగైన సేవలు అందేలా చూడాలని అధికారులు, సిబ్బందిని ఆదేశించారు.. వైద్యులు ఎవరు రోగులకు బయట మెడికల్



షాపులకు మందులు రాస్తే ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. డయాలసిస్ సెంటర్ లో పేషెంట్లకు తగ్గట్టుగా సిబ్బంది లేకపోవడంపై మేనేజర్ పై ఎమ్మెల్యేగా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.. డయాలసిస్ పేషెంట్లకు స్లాట్ టైమింగ్ ప్రకారం వైద్య సేవలు అందడంలేదని రోగులు కొందరు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేసిన నాగేశ్వరరావు డయాలసిస్ రోగులకు సరైన చికిత్స అందించేలా చూడాలని ఆస్పతి సూపరింటెండెంట్ ను ఎమ్మెల్యే ఆదేశించారు. ప్రజలకు మెరుగైన వైద్యం అందించే విధంగా వైద్యాధికారులు పనిచేయాలని, సిబ్బంది అందరూ సమయ పాలన పాటించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. లేనిచో కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ శకుంతల వైద్యాధికారులు, ఆస్పత్రి సిబ్బంది, పార్టీ నాయకులు చదలవాడ కొండయ్య పాల్గొన్నారు.

# కెటిసిలో నవోదయ స్టడీ మెటీరియల్ విడుదల చేసిన కనిగిరి సిఐ ఖాజావలి



(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, ఆగస్టు 7)

స్థానిక కెటిసి స్టడీ సర్కిల్‌లో డాక్టర్ కెటిసి పాపారాయుడు రచించిన నవోదయ స్టడీ మెటీరియల్ ను కనిగిరి సిఐ షేక్ ఖాజావలి గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా సిఐ షేక్ ఖాజావలి మాట్లాడుతూ ప్రతి విద్యార్థిని, విద్యార్థులు బాగా కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలని, డాక్టర్ కెటిసి పాపారాయుడు నిర్వహిస్తున్న ఈ సంస్థ దిన దిన ప్రవర్ధమానమై వెలుగొందాలని పేర్కొన్నారు. చాలా సుదూర ప్రాంతాల నుంచి మన కనిగిరికి రావటం చాలా సంతోష దాయకం అన్నారు. అందుకు గాను డాక్టర్ కెటిసి పాపారాయుడును అభినందిస్తున్నానన్నారు. జన విజ్ఞాన వేదిక జాతీయ ఉపాధ్యక్షులు షేక్ గయాజ్ భాష మాట్లాడుతూ మీరందరూ బాగా చదువుకుని సిఐ ఖాజావలి లాగా గొప్ప స్థాయికి ఎదగాలని పేర్కొన్నారు. కెటిసి చైర్మన్ డాక్టర్ కెటిసి పాపారాయుడు మాట్లాడుతూ సిఐ వారి విలువైన సమయాన్ని మనకు కేటాయించి నందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కెటిసి స్టడీ సర్కిల్ కనిగిరి బ్రాంచ్ డైరెక్టర్ ఆదినారాయణ మాట్లాడుతూ కనిగిరిలో మొట్ట మొదటగా నవోదయ సైనిక్ స్కూల్ కోచింగ్‌ను మేమే ప్రారంభించామన్నారు. ఇప్పటి వరకు మొత్తం 42 మంది సీట్లు సాధించామన్నారు. ఇంకా మరెన్నో సీట్లు సాధించి వారి యొక్క ఉజ్వల భవిష్యత్తు కొరకు మా వంతు మేము పాటుపడతాం అని అన్నారు. ఈ కార్యక్రమం లో ముఖ్య అతిథిగా కనిగిరి సిఐ షేక్ ఖాజావలి, ప్రత్యేక అతిథిగా జన విజ్ఞాన వేదిక జాతీయ ఉపాధ్యక్షులు షేక్ గయాజ్ భాష , కె టి సి స్టడీ సర్కిల్ చైర్మన్ డాక్టర్ కె టి సి పాపారాయుడు, కెటిసి స్టడీ సర్కిల్ కనిగిరి బ్రాంచ్ డైరెక్టర్ కె ఆదినారాయణ, ఉపాధ్యాయునిలు శ్రావణి, అను పల్లవి, విధార్థిని, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.





## దశదిన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ముత్తుముల



(షణ్ముఖ వెలుగు, గిద్దలూరు, ఆగస్టు 7)

మండలంలోని తాళ్లపల్లె గ్రామంలో గురువారం మండల పార్టీ అధ్యక్షులు మార్తాల సుబ్బారెడ్డి తండ్రి స్వర్గీయ సుబ్బారెడ్డి దశదిన కార్యక్రమంలో గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి పాల్గొని ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యేతో పాటు టీడీపీ నాయకులు ముత్తుముల కృష్ణకిషోర్‌రెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ బైలడుగు బాలయ్య, ముండ్లపాడు సర్పంచ్ కడియం శేషగిరి, కొమ్మునూరు సర్పంచ్ కర్నాటి రామ సుబ్బారెడ్డి, టీడీపీ సీనియర్ నాయకులు హుస్సేన్ ఖాన్, కో ఆప్షన్ మెంబర్ సయ్యద్ పీరా ఖాన్, మరియు మాజీ సర్పంచ్ గోపాలకృష్ణ, చేరెడ్డి జయరామిరెడ్డి, సయ్యద్ బాషా, దేశబోయిన రాజు, కంచర్ల కిరణ్ గ్రామ నాయకులు పాల్గోన్నారు.

## పాముల వారి వివాహా కార్యక్రమంలో ఎమ్మెల్యే ముత్తుముల



(షణ్ముఖ వెలుగు, గిద్దలూరు, ఆగస్టు 7)

పట్టణంలోని కృష్ణా థియేటర్ సమీపంలో ప్రముఖ దినపత్రిక విలేకరి పాముల వెంకట విజయ భాస్కర్ కుమార్తె అఖిల వివాహ కార్యక్రమం గురువారం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ముఖ్య అతిధిగా పాల్గొని కాబోయే నూతన వధువును ఆశీర్వదించి శు భాకాంక్షలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో గిద్దలూరు, కంభం మార్కెట్ యార్డ్ చైర్మన్లు బైలడుగు బాలయ్య, పూనూరు భూపాల్‌రెడ్డి, ఆంధ్రజ్యోతి జిల్లా బ్రాంచ్ మేనేజర్ ఐవి సుబ్బరావు, టీడీపీ నాయకులు ముత్తుముల కృష్ణకిషోర్‌రెడ్డి, గిద్దలూరు మున్సిపల్ చైర్మన్ పాముల వెంకట సుబ్బయ్య, పట్టణ కౌన్సిలర్లు బూనబోయిన చంద్రశేఖర్, లోక్కు రమేష్, సర్పంచ్ రామసుబ్బారెడ్డి, మండ్ల శ్రీనివాసులు, క్రాంతి, సంపత్‌రెడ్డి, వాడకట్టు రాము, పట్టణ నాయకులు, మీడియా ప్రతినిధులు శ్రీనివాసులు, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

## బస్ జాతను జయప్రదం చేయండి



(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం ఇన్‌ఛార్జి, ఆగస్టు 7)

28వ రాష్ట్ర మహాసభలను పురస్కరించుకొని ఈనెల 9 తేదీ వైపాలెం నియోజకవర్గంలో జరుగు బస్ జాతను జయప్రదం చేయాలనీ సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బాణాల రామయ్య పిలుపునిచ్చారు. యర్రగొండపాలెం లోని సీపీఐ కార్యాలయంలో గురువారం సీపీఐ ఆధ్వర్యంలో విలేకర్ల సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒంగోలు నగరంలో ఈనెల 20 నుండి రాష్ట్ర మహా సభలను ఏర్పాటు చేయడం జరిగింది. అందులో భాగంగా జిల్లా ప్రజలను చైతన్యం చేసేందుకు బస్సు జాత ఏర్పాటు చేయడం జరిగింది. ఈజాత యర్రగొండపాలెం నియోజకవర్గం లోని పెద్దరవీడు నుండి మొదలై త్రిపురాంతకంలో మొగుస్తుంది. ఈ జాతలో కళాజాతకం బృందం ద్వారా అవగాహన కల్పిస్తూ నియోజకవర్గంలో విస్తృత ప్రచారం జరుగుతుంది. ఈ జాతలో సీపీఐ నాయకులు, కార్యకర్తలు, అభిమా నులు, సానుభూతిపరులు పాల్గొని జయ ప్రదం చేయాలనీ పిలుపునిచ్చారు. రాష్ట్ర మహా సభలలో జిల్లా అభివృద్ధికి అవసరమైన పలు అంశాలపై చర్చించటం జరుగుతుంది. జిల్లాకు సంబందించిన వెలుగొండ ప్రాజెక్టు కు 4 వేల కోట్లు నిధులు కేటాయించి వెలుగొండ ప్రాజెక్టు ద్వారా సాగు, తాగు నీరు అందించాలన్నారు. దొనకొండ ను పారిశ్రామిక కేంద్రంగా ఏర్పాటు చేయాలన్నారు. మార్కాపురంను నూతన జిల్లాగా చేసి పచ్చిమ ప్రకాశం అభివృద్ధికి సహకరించాలని కోరారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల వైఖరిని ఎండగట్టేలా చర్యలు తీసుకోవడానికి తీర్మానం చేయడం జరుగుతుంది అన్నారు. సీపీఐ సీనియర్ నాయకులు టీసీహెచ్ చెన్నయ్య, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కెవి కృష్ణ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## తల్లి పాలు బిడ్డకి ఔషధం



(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, ఆగస్టు 7)

మండలంలో జెడ్ మేకపాడు గ్రామంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా బాలింతలకు, గర్భిణీ స్త్రీలకు, తల్లిదండ్రులకు, గురువారం అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాలపై అవగాహన కల్పించారు. అంగన్వాడీ టీచర్ వై సత్యవతి మాట్లాడుతూ తల్లి గర్భం దాల్చిన దగ్గర నుండి ముర్రుపాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని అన్నారు, తల్లికి సిజేరియన్ డెలివరీ అయినా సరే కచ్చితంగా గంట లోపల ముర్రు పాలు తాగించాలని, ఆరు నెలల కేవలం తల్లిపాలు మాత్రమే బిడ్డకు సంపూర్ణ ఆహారం అని, తల్లిపాలు బిడ్డకి రెండు సంవత్సరాల వరకు కొనసాగించాలని శిశువు ఎదుగుదలకు అవసరమైన పోషకాలు తల్లిపాలలో ఉంటాయని, తల్లీ బిడ్డ అనుబంధాన్ని పెంచుతుందని, అండాశయ, రొమ్ము క్యాన్సర్ ప్రమాదము తగ్గిస్తుందని, శిశువుకు రోగనిరోధక శక్తి పెంచుతుందని, బిడ్డల ఐక్యూ స్థాయిని పెంచుతుందని, కనుక తప్పని సరిగా తల్లిపాల యొక్క విలువని గ్రహించి తల్లిపాలు బిడ్డలకి పట్టించాలని ఆమె అన్నారు. లేనిచో పిల్లలు వ్యాధుల బారిన పడే అవకాశం ఉందన్నారు. బాలింతలు పౌష్టికాహారం తీసుకుని పాల ఉత్పత్తి పెంచే, పాలకూర పప్పులు, పాలు, గుడ్లు, కొబ్బరిపాలు మెంతి పొడి, మునగాకు, బెల్లం, ఎక్కువగా మంచి నీరు తాగటం చేయాలని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో గర్భిణీలు, బాలింతలు, తల్లిదండ్రులు, ఆశ వర్కర్ ఖాదర్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## కంది విత్తనాలు పంపిణీ





(షణ్ముఖ వెలుగు, పొదిలి, ఆగస్టు 7)

మండలంలోని మల్లవరం సచివాలయం పరిధిలోని అక్కచెరువు గ్రామంలో రైతులకు ఆదర్శ అపరాల గ్రామ పథకం క్రింద 350 ఎకరాలలో ఎల్ఆర్‌జీ 52 ( అమరావతి) అను కంది రకం విత్తనాలను రైతులకు ఉచితంగా కృషి విజ్ఞాన కేంద్రం, దర్శి వారి ఆధ్వర్యంలో ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డా. జి. రమేష్ , సేద్య విభాగం శాస్త్రవేత్త ,డాక్టర్. టి. వెంకటేశ్వర రెడ్డి మాట్లాడుతూ ఎల్ఆర్‌జీ 52 అను కంది రకం పంట కాలం 160-170 రోజులు, ఎకరాకి 5-6 క్వింటలు దిగుబడి వస్తుంది అని తెలిపారు, ఎండు తెగులుని కొంతవరకు తట్టు కుంటుంది అని తెలిపారు. కంది పంటలో తీసుకోవలిసిన సమగ్ర పంట యాజమాన్య పద్ధతులను గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పొదిలి మండల వ్యవసాయ అధికారి దేవిరెడ్డి శ్రీనివాసులు, గ్రామ వ్యవసాయ సహాయకులు, ఆయా గ్రామంలోని రైతులు పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధులను నియంత్రించాల్సిన బాధ్యత అధికారుల పై ఉంది

### జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, బాపట్ల, ఆగస్టు 7)

సీజనల్ వ్యాధులను నియంత్రించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. సీజనల్ వ్యాధుల నియంత్రణపై 11 శాఖల అధికారులతో గురువారం ఆయన వీక్షణ సమావేశం నిర్వహించారు. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని కలెక్టర్ స్పష్టం చేశారు. వర్షాకాలంలో అంటువ్యాధులు ప్రబలకుండా అధికారులు ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. అంటు వ్యాధులు ప్రభలే అవకాశమున్న పరిస్థితులలో అధికారులు జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. నిద్రాహారాలు మాని చిత్తశుద్ధితో పనిచేయాలని హెచ్చరించారు. ముఖ్యంగా నగరం, నిజాంపట్నం, చెరుకుపల్లి, వేటపాలెం మండలాలలో అధికారులంతా అప్రమత్తం కావాలన్నారు. డెంగ్యూ, విష జ్వరాల వంటివి ప్రబలకుండా, అన్ని పరిస్థితులు అధీనంలోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ ఆదేశాలను విస్మరిస్తే ఉపేక్షించేది లేదన్నారు. డెంగ్యూ కేసులు నమోదైన చోట అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ చెప్పారు. చెరుకుపల్లి, నగరం, వేటపాలెం నగరం మండలాలలో 8 డెంగ్యూ కేసులు నమోదయాయన్నారు. డెంగ్యూ కేసులు పెరగకుండా అధికారులు ప్రణాళిక బద్ధంగా చర్యలు తీసుకోవాలన్నారు. రాపిడ్ టెస్ట్ లు చేయాలని ఆదేశించారు. డెంగ్యూ కేసులు నమోదైన ప్రాంతం నుంచి పది కిలోమీటర్ల చుట్టూ పరిధిలో దోమల లార్వా నిర్మూలనకు స్ప్రేయింగ్ చేయాలన్నారు. మురుగునీరు, వర్షం నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నిల్వ ఉన్న నీటిలో దోమల నియంత్రణకు ఆయిల్ బాల్స్ వేయాలని, లార్వా నిర్మూలనకు గంబూషియా చేపల యూనిట్లు 100 విడుదల చేయాలని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాంతాలలో ఫాగింగ్ చేపట్టాలన్నారు. విధుల పట్ల నిర్లిప్తంగా వ్యవహరిస్తే గ్రామ, మండల, జిల్లా స్థాయి అధికారులనైనా ఉపేక్షించేది లేదన్నారు. ప్లాస్టిక్ డబ్బాలు, టైర్లు, కొబ్బరి బొండాలను చెప్పు సంపద కేంద్రాల గాకుండా డంప్ చేస్తే చర్యలు ఉంటాయన్నారు. పారిశుద్ధ్య కార్యక్రమాలలో నిబంధనలు కచ్చితంగా పాటించాలన్నారు. తాగునీరు కలుషితం గాకుండా చూడాలని, నీటిని శుద్ధి చేసి సరఫరా చేయాలన్నారు. గ్రామాలలో ఎక్కడపడితే అక్కడ చెత్త లేకుండా పారిశుధ్య కార్యక్రమాలు పక్కాగా నిర్వహించాలన్నారు. బాపట్ల జిల్లాను ఫైవ్ స్టార్ మాదిరిగా మార్చాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. సమష్టి కృషితోనే అంటూ వ్యాధులు పూర్తిస్థాయిలో నిర్మూలించగలరని ఆయన పలు సూచనలు చేశారు. ఈ సమావేశాలు ఇంచార్జి సంయుక్త కలెక్టర్, డి ఆర్ ఓ జి.గంగాధర్ గౌడ్, వివిధ శాఖల జిల్లా అధికారులు, మండల స్థాయి అధికారులు, ఎంపీడీవోలు, వైద్య ఆరోగ్యశాఖ తదితరులు పాల్గొన్నారు.



## నూతన వరుడిని ఆశీర్వదించిన ఎమ్మెల్యే ముత్తుముల



(షణ్ముఖ వెలుగు, గిద్దలూరు, ఆగస్టు 7)

గిద్దలూరు మండలం, ముండ్లపాడు గ్రామంలో పీక్కిలి బుజ్జి కుమారుని వివాహ కార్యక్రమంలో గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ముఖ్య అతిధిగా పాల్గొని నూతన వరుడిని ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో గిద్దలూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ బైలడుగు బాలయ్య, స్థానిక సర్పంచ్ కడియం శేషగిరి, సొసైటీ బ్యాంకు డైరెక్టర్ బొమ్మినేని వెంకటేశ్వర్లు, ఏఎంసీ డైరెక్టర్ వినుకొండ ప్రేమ్ కుమార్, యూనిట్ ఇంచార్జ్ మండ్ల రంగనాయకులు, శివపురం మురళీ, మోడీగారి కృష్ణ, గ్రామ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## చాగొల్లు ఎస్టి కాలనీ అంగన్వాడి కేంద్రంలో తల్లిపాలు వారోత్సవాల కార్యక్రమం





(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, ఆగస్టు 7)

మండలంలోని వీరేపల్లి సెక్టార్ పరిధిలోని ఎస్టి కాలనీ అంగన్వాడి కేంద్రంలో సిడిపిఓ డి. మాధవి లత ఆదేశాల మేరకు సూపర్వైజర్ కె. రమాదేవి ఆధ్వర్యంలో గురువారం తల్లిపాలు వారోత్సవాలు చివరి రోజు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఇందులో భాగంగా బాలింతలకు గర్భవతులకు తల్లిపాల గురించి వివరించడం జరిగింది. బిడ్డ పుట్టిన గంటలోపు తల్లి బిడ్డకు పాలు ఇవ్వటం ఎంతో అవసరం అని ఆ పాలను ముర్రిపాలు అని పిలుస్తారని తల్లిపాలు తాగిన బిడ్డలు తెలివిగా ఆరోగ్యంగా ఉంటారని తెలియజేశారు. తల్లిపాలకు మద్దతునిచ్చి స్థిరమైన వ్యవస్థను ఏర్పాటు చేసి తల్లిపాల సంస్కృతి ప్రోత్సాహానికి ప్రాధాన్యతనిద్దాం, అన్న నినాదంతో ప్రతి తల్లి కచ్చితంగా బిడ్డకు ఆరు నెలల వరకు కేవలం తల్లిపాలు ఇవ్వాలి. తల్లిపాలు బిడ్డ హక్కు తొలి టీకా జీవితానికి కవచం ఆరోగ్య భద్రతకు బలమైన పునాది తల్లిపాలు ఇవ్వడం వల్ల బిడ్డకు కాదు తల్లికి కూడా శారీరకంగా, మానసికంగా, ఆర్థికంగా రక్షణ లభిస్తుందని తెలియజేయడం జరిగింది. కార్యక్రమంలో సూపర్వైజర్ కె రమాదేవి, ఏఎన్ఎం, ఆశ, ఏ డబ్ల్యు డబ్ల్యు, తల్లులు, గర్భవతులు పాల్గొన్నారు.

## ఆంధ్రప్రదేశ్‌లో చీకటి దుకాణాలు ప్రమాణాలు పాటింపు పై మాగుంట ప్రశ్న

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 7)

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సరైన ప్రమాణాలు పాటించని చీకటి దుకాణాల గురించి సర్వే, గత 5 సంవత్సరాలలో నిర్వహించిన దాడులు, వాటిని నిర్వహిస్తున్న కంపెనీలు, వసూలు చేసిన జరిమానాలు, నిబంధనలు పాటించని కంపెనీల నిలుపుదల ,అవగాహన సదస్సుల గురించి పార్లమెంటు సమావేశాలలో ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి ప్రశ్నించారు. ఆయన అడిగిన ప్రశ్నకు కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, ప్రజా పంపిణీ రైల్వే శాఖ సహాయక మంత్రి బియల్ వర్మ సమాధానమిస్తూ 2024-25లో బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ వారు మార్కెటులో ఆన్ లైన్ వ్యాపారం, త్వరిత వాణిజ్య కంపెనీల ద్వారా అమ్మే వస్తువుల కార్యకలాపాలపై పర్యవేక్షణ చేసి, నాణ్యత నియంత్రణ ఆదేశాలు ననుసరించి 344 నమూనాలు సేకరించి, చెల్లుబాటుకాని 142 నమూనాలను గుర్తించిందని తెలిపారు. 2024-25 నుంచి దేశంలో నిబందనలు ఉల్లంఘించిన 22 ఆన్ లైన్ , వాణిజ్య కంపెనీలపై దర్యాప్తులు జరిగాయన్నారు. అందులో డిల్లీ, హర్యానా, మహారాష్ట్ర , కర్నాటక రాష్ట్రాలలో మూడు చొప్పున, రాజస్తాన్, తమిళనాడు రాష్ట్రాలలో రెండు చొప్పున గుజరాత్, ఒడిస్సా, తెలంగాణా, ఉత్తర్ ప్రదేశ్, ఆంధ్రప్రదేశ్ ,ఉత్తరాఖండ్ రాష్ట్రాలలో ఒకటి చొప్పున ఆన్ లైన్, వాణిజ్య కంపెనీలు వున్నాయని, అందులో 14 అమెజాన్ కంపెనీవి, 7 ఇన్స్టా కార్ట్ కంపెనీవి, 1 బ్లిన్ కిట్ కంపెనీది వున్నాయని తెలిపారు. ప్రింట్, సామాజిక, ఎలక్ట్రానిక్ మాధ్యమాల ద్వారా ఇన్స్ ట్రాగ్రాం , పేస్‌బుక్‌పై ఆన్ లైన్ వ్యాపారానికి అవసరమైన ప్రమాణాల గురించి అవగాహన సదస్సుల నిర్వహించబడుచున్నాయని కేంద్ర మంత్రి తెలియజేశారు.

# చేనేత ఉత్పత్తులను ఆదరించాలి

### జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాలకృష్ణ

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 7)

చేనేత ఉత్పత్తులను ఆదరించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాలకృష్ణ అన్నారు. జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం చేనేత కార్మికులతో కలెక్టరేట్లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ స్వదేశీ ఉద్యమంలో చేనేత ఉత్పత్తులు కూడా కీలక పాత్ర పోషించాయన్నారు. కాలపరీక్షను ఎదుర్కొని నిలబడిన చేనేత రంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందన్నారు. చారిత్రక విశిష్టత కలిగిన చేనేత తరంగాన్ని ఆదుకునేలా ప్రభుత్వం విద్యుత్తు, జీఎస్టీ రాయితీతోపాటు చేనేతకారుల కుటుంబాలకు ఆర్థిక సహాయం చేయాలని నిర్ణయం తీసుకుందన్నారు. చేనేత సొసైటీలకు ఆప్కో నుంచి రావాల్సిన బకాయిలు త్వరగా చెల్లించేలా చర్యలు తీసుకుంటానని ఆయన హామీ ఇచ్చారు. ప్రతి సోమవారం కలెక్టర్ కార్యాలయంలో గ్రీవెన్స్ సందర్భంగా చేనేత ఉత్పత్తులను సొసైటీలు విక్రయించుకునేలా అవకాశం కల్పిస్తామని ప్రకటించారు. మరో స్వాతంత్ర్య ఉద్యమంలాగా చేనేత ఉత్పత్తులను ఆదరించాలని ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు. ఎల్‌డిఎం రమేష్ మాట్లాడుతూ చేనేతకారులకు ముద్ర రుణాలు త్వరగా మంజూరు అయ్యేలా చర్యలు తీసుకుంటానని చెప్పారు. చేనేత, జౌళి సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు రఘునందన్ మాట్లాడుతూ జిల్లాలో



50 ఏళ్లు పైబడిన 1762 మంది చేనేత కార్మికులు నెలకు రూ.4వేలు చొప్పున ఎన్టీఆర్ పెన్షన్ కానుక పొందుతున్నట్లు చెప్పారు. ముద్ర పథకం కింద బ్యాంకు రుణాల కోసం 2024 - 25 సంవత్సరంలో 217 దరఖాస్తులు వచ్చాయని, వీటిలో 27 దరఖాస్తుదారులకు రూ.26 లక్షల రుణం మంజూరు చేసినట్లు తెలిపారు. సమగ్ర చేనేత క్లస్టర్ డెవలప్మెంట్ పథకం కింద ఒక్కొక్కటి రూ.1.20 లక్షల విలువైన వ్యక్తిగత వర్క్ షెడ్లను జిల్లాలో 20 మందికి మంజూరు చేసినట్లు వివరించారు. చేనేతకారులకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు ఇవ్వాలని ప్రభుత్వం



నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో జిల్లాలో అర్హులైన 659 మంది పేర్లను రాష్ట్ర కార్యాలయానికి పంపించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఏడుగురు చేనేతకారులను జాయింట్ కలెక్టర్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో చేనేత, జౌళి శాఖ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ వి భీమయ్య, డెవలప్మెంట్ ఆఫీసర్ ఏ.వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ డెవలప్మెంట్ ఆఫీసర్ టి. వెంకటేశ్వర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు. దీనికి ముందుగా ప్రకాశం భవనం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు నిర్వహించిన ర్యాలీని డిఆర్ఓ బి.చిన ఓబులేసు ప్రారంభించారు. చేనేత రంగ విశిష్టతను ఆయన కొనియాడారు.

## నేటి నుండి శ్రీగిరి పవిత్రోత్సవాలు

### బిశ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి వెల్లడి





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 7)

ఒంగోలులోని కుర్తాళం శ్రీ సిద్దేశ్వరీ పీఠపాలిత శ్రీగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి పవిత్రోత్సవాలను ఆగస్టు 8వ తేదీ శుక్ర వారం నుండి 10వ తేదీ ఆదివారం వరకు శాస్త్రోక్తంగా నిర్వహిస్తున్నట్లు శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి, ఆర్జిత సేవల ధర్మకర్త ఆలూరు సుశీలా దేవి, కార్య నిర్వహణ ధర్మకర్త సివి రామకృష్ణారావు, ధర్మకర్తలు ఆలూరు వెంకటేశ్వరరావు, ఆలూరు లక్ష్మి కుమారి, శ్రీగిరి దేవస్థానం ఉత్తర అమెరికా ప్రతినిధి డాక్టర్ ఆలూరు శ్రీనివాస చరణ్ రాజీవ్, ఆలూరు జై శంకర్ వెల్లడించారు. పవిత్రోత్సవాలలో భాగంగా ఈ నెల 8వ తేదీ శుక్రవారం ఉదయం శ్రీవారికి శుక్ర వార అభిషేకం, సహస్ర నామార్చన, జరుగుతాయన్నారు. సాయంత్రం 6 గంటలకు విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచనం, మేదినీ పూజ, మృత్సంగ్రహణం, అంకురార్పణ, చతుర్వేద పారాయణ, రక్షాబంధనం కార్యక్రమాలను నిర్వహిస్తారని తెలిపారు. శ్రీవారి పవిత్రోత్సవాలలో పాల్గొన దలచిన భక్తులు శ్రీగిరి దేవస్థానం కార్యాలయంలో సంప్రదించి తమ పేర్లను నమోదు చేసుకోవాలని శ్రీగిరి దేవస్థానం నిర్వాహకులు కోరారు.

## బిజెపి రాష్ట్ర అధ్యక్షుడికి అభినందనలు

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 7)





ప్రకాశం జిల్లా ఒంగోలు పర్యటనకు గురువారం బీజేపీ నూతన అధ్యక్షుడు మాధవ్ వచ్చారు. ఈ సందర్భంగా ఆయనను బిజెపి జిల్లా అధికార ప్రతినిధి బెల్లంకొండ విజయలక్ష్మి ఆధ్వర్యంలో పొదిలి మండల నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి ఆయనకు బొకే అందజేసి శాలువాలు కప్పి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పొదిలి మండల బిజెపి అధ్యక్షుడు దోర్నాల రమణారెడ్డి, పట్టణ అధ్యక్షుడు యుద్ధం మహేష్, ఇతర పొదిలి మండల, పట్టణ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రజలు సహకరించాలి

### మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్



(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, ఆగస్టు 7)

మున్సిపాలిటీ అభివృద్ధికి పట్టణ ప్రజలు సహకరించాలని మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ అన్నారు.సమస్య పరిష్కారం కార్యక్రమంలో భాగంగా గురువారం కనిగిరి పట్టణంలోని 14 వ వార్డులోని బొడ్డుచావిడి ప్రాంతంలో చైర్మన్ పర్యటించారు. అనంతరం ప్రజలతో మాట్లాడి క్షేత్రస్థాయిలో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అభివృద్ధిలో భాగంగా బొడ్డు చావిడి నుండి నాజ్ సెంటర్ వరకు మరియు కన్యకా పరమేశ్వరి దేవస్థానం వరకు వేసిన రోడ్డును పరిశీలించారు. అదేవిధంగా దొరువు వైపు రోడ్డులో కూడా కొంత భాగం సిమెంట్ రోడ్డు వేయవలసిన ఆవశ్యకత ప్రజలు చైర్మన్ కి తెలుపగా వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ కొత్తగా నిర్మించిన రోడ్డును త్వరలో స్థానిక శాసన సభ్యుల చేతుల మీదుగా ప్రారంభిస్తామని అన్నారు. కనిగిరి మున్సిపాలిటీ అంచెలంచెలుగా అభివృద్ధి అవుతుందని సదరు అభివృద్ధికి ప్రజా సహకారం చాలా గొప్పదని, ప్రజల సహకారం లేనిది ఏమి చేయలేమన్నారు. భవిష్యత్తులో మంజూరు అయ్యే నిధులతో దొరువు నుండి ఓ వి రోడ్డు వరకు కొత్త రోడ్డు మరియు కాలువ నిర్మాణం చేపట్టి అభివృద్ధి చేస్తామన్నారు. స్థానిక శాసనసభ్యుల సహకారంతో అభివృదే ధ్యేయంగా పనిచేస్తున్నామన్నారు. అందుకు ప్రజల సహకారం చాలా అవసరం అన్నారు. ఈ ప్రాంతంలోని వ్యాపారస్తులు ప్రజల రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది కలగనీయకుండా ట్రాఫిక్కు అంతరాయం లేకుండా కనిగిరి మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రజలు సహకరించాలని కోరినారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ తో పాటు ఏఈ కోటేశ్వరరావు, కాంట్రాక్టర్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



# 9న చీమకుర్తిలో జరిగే కాంగ్రెస్ పార్టీ



**ర్యాలీ, సభను జయప్రదం చేయండి**
**సంతనూతలపాడు నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జిగా సుధాకర్ పదవీ బాధ్యతల స్వీకారం**
**పార్టీ సంస్థగత నిర్మాణం పై సమీక్ష**
**పాల్గొన్న రాష్ట్ర, కేంద్ర స్థాయి నాయకులు**
**భవిష్యత్తు ప్రధాని రాహుల్ గాంధీ నే**
**కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు షేక్ సైదా, సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్చార్జ్ పసుమర్తి సుధాకర్**

**(షణ్ముఖ వెలుగు, చీమకుర్తి, ఆగస్టు7):**
రానున్న రోజుల్లో ఈ దేశానికి ప్రధానిగా రాహుల్ గాంధీ ఎన్నిక కావడం తధ్యమని, ఈ దేశానికి ఈ రాష్ట్రానికి దిశ నిర్దేశం చేసే శక్తి ఒక కాంగ్రెస్ పార్టీకే ఉందని, భారత రాజ్యాంగాన్ని పరిరక్షించాలన్న, ప్రజాస్వామ్యాన్ని కాపాడాలన్న, దేశ సార్వభౌమ త్వాన్ని పరిరక్షించే బాధ్యత ను కాంగ్రెస్ పార్టీ తీసుకుంటుందని నేడు చీమకుర్తి పట్నంలోని జే. అండ్.ఎం కన్వెన్షన్ లో జరిగిన విలేకరుల సమావేశంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు షేక్ సైదా అన్నారు. ఈ నెల 9 తేదీన చీమకుర్తి పట్నంలో జరిగే కాంగ్రెస్ పార్టీ ర్యాలీని సభను జయప్రదం చేయాలని సైదా కోరారు. సంతనూతలపాడు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నూతన సమన్వయ కర్తగా నియమింపబడిన పసుమర్తి సుధాకర్ ఆరోజు పదవి బాధ్యతలు చేపట్టనున్నట్లు సైదా తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూల నుంచి విచ్చేసి పార్టీ మండల పార్టీ అధ్యక్షుడు, జిల్లా పార్టీ కార్యవర్గ సభ్యులతో ప్రత్యేకంగా సమావేశమై పార్టీ సమస్త గత నిర్మాణంపై సమీక్ష నిర్వహించి భవిష్యత్ కార్యాచరణ చేపట్టడం జరుగుతుందని ఆయన అన్నారు.

సంతనూతలపాడు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త పసుమర్తి సుధాకర్ మాట్లాడుతూ 9వ తేదీ జరిగే కార్యక్రమానికి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు షేక్ సైదా అధ్యక్షత వహిస్తారని, కేంద్ర మాజీ మంత్రివర్యులు,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జె.డి .శీలం మాజీ ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మస్తాన్వలి, బాపట్ల డిసిసి అధ్యక్షులు ఆమంచి కృష్ణమోహన్, ప్రకాశం, బాపట్ల, గుంటూరు, చిత్తూరు జిల్లాల పార్టీ ఇన్చార్జీలు గౌతు సత్యేంద్ర బాబు, గడ్డం విజయపాల్, శ్రీపతి ప్రకాశం, ఈదా సుధాకర్ రెడ్డి, బాపట్ల మాజీ డిసిసి అధ్యక్షులు గంట అంజిబాబు జిల్లా లోని ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గ ల పార్టీ సమన్వయకర్తలు ముఖ్య నాయకులు పాల్గొన్నట్లు ఆయన తెలిపారు . సంతనూతలపాడు నియోజకవర్గంతో పాటు జిల్లాలోని అన్ని నియోజకవర్గాలకు చెందిన మండల పార్టీ అధ్యక్షులు ,అనుబంధ సంఘాల అధ్యక్షులు జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొని ర్యాలీని, సభను జయప్రదం చేయాలని ఆయన కోరారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ డిపార్ట్మెంట్ చైర్మన్ మన్నం ప్రసన్న రాజు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ద్వారానే ఈ దేశంలో దళితులకు మైనార్టీ వర్గాలకు రక్షణ ఏర్పడుతుందని ఆ వర్గాలు తప్పనిసరిగా కాంగ్రెస్ ను ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు తుమ్మల సుబ్బారావు, ఇరిగినేని వెంకట నరసయ్య, చీమకుర్తి మండల పార్టీ అధ్యక్షులు వేల్పుల వెంకటేశ్వర్లు, చీమకుర్తి పట్టణ అధ్యక్షులు కొప్పుల శివశంకర్, సంతనూతలపాడు మండల పార్టీ అధ్యక్షుడు దుంప ఎలమందరెడ్డి, చిరంజీవి, షేక్ ఈసంపల్లి కాలేశా రాజ వర్ధన్‌రావు, ఏసోబు, గర్నెపూడి శ్యామ్, తదితరులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులతో అల్లాడుతున్న చిన్నారులు

**సీజనల్ వ్యాధులను అరికట్టాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే**



**(షణ్ముఖ వెలుగు, కంభం, ఆగస్టు 7)**
కంభం మండలంలో సీజనల్ వ్యాధులు రోజురోజుకి పెరుగుతున్నాయి. కంభం ప్రభుత్వ ఆసుపత్రి లో సీజనల్ జ్వరాలు,డెంగ్యూ బారిన చిన్నపిల్లలు ఎక్కువగా ఆసుపత్రిలో వైద్యం కోసం అధిక సంఖ్యలో చేరడంతో సీజనల్ వ్యాధులు ఏవిధంగా ప్రభలుతున్నాయో తెలుస్తుంది. వర్షాకాలం వస్తే మరీ ఎక్కువగా వ్యాధులు వస్తున్నాయని సంభంధిత అధికారులు స్పందించి సీజనల్ వ్యాధులు ఇంకా ఎక్కువ కాకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని సీజనల్ వ్యాధులు ఎక్కువగా దోమలు మరియు పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా లేకపోవడం వలనే ఎక్కువగా సంభవిస్తాయని సంభంధిత అధికారులు వెంటనే స్పందించి చుట్టుపక్కల పరిసరాలు శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని దోమలు చేరకుండా తగిన చర్యలు తీసుకోవాలని సంభంధిత అధికారులను కోరుతున్నారు.

## పీ4 కార్యక్రమం పై సమీక్ష

**(షణ్ముఖ వెలుగు, కొండపి ఇన్‌ఛార్జి, ఆగస్టు 7)**
జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా దేశాల మేరకు కొండపి







మండల పరిషత్ కార్యాలయంలో గౌరవ కాంసిడెన్సిస్పెషల్ ఆఫీసర్ ఆధ్వర్యంలో పీ4 కార్యక్రమం పై సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశంలో స్పెషల్ ఆఫీసర్ శ్రీధర్ రెడ్డి మాట్లాడుచూ, లిసర్వేలో గుర్తించిన బంగారు కుటుంబాలను, రెండు రోజులలో ఎడాప్షన్ కంప్లీట్ చేయాలన్నారు. అసెస్మెంట్ నీడ్ ఈ రోజు సాయంకాలము లోపుగా సర్వే వెంటనే 100% కంప్లీట్ చేయాలని, ఎడాప్షన్ కొరకు, మార్గదర్శులను గుర్తించాలని, ఇవన్నీ కూడా ఒక ప్రణాళిక బద్ధముగా వర్క్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రామకృష్ణ, తహసిల్దార్, పంచాయతీ కార్యదర్శులు, మండల కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

## అలాగాయపాలెం పాతరెడ్డి పాలెంలో సుపరి పాలనలో తొలి అడుగు కార్యక్రమం



**(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, ఆగస్టు 7)**
మండలంలోని కరేడు పంచాయతీ అలగాయపాలెం గ్రామంలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సుపరిపాలనలో తొలి అడుగు ఇంటింటా తెలుగుదేశం కార్యక్రమం గురువారం అలగాయపాలెం పాతరెడ్డిపాలెం లో టిడిపి నాయకులు ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తలతో కలసి ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలో చేసిన అభివృద్ధి సంక్షేమం పనుల గురించి ప్రజలకు వివరించడం జరిగింది. తల్లికి వందనం, దీపం-2 పథకం కింద ఏడాదికి మూడు సిలిండర్లు రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తుందని ప్రజలకు వివరించి కరపత్రాలు అందజేసి మీకు ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ టిడిపి నాయకులు కోమట్ల వెంకటరామిరెడ్డి, పెల్లేటి శ్రీనివాసులరెడ్డి, గుమ్మడి శీను, కోమట్ల శ్రీనివాసరెడ్డి, కోమట్ల మహేష్, పాదాల నాగిరెడ్డి, గుమ్మడి వెంకటేశ్వర్లు, గుమ్మడి ఏడుకొండలు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.





## రైతులు పంటలకు ఈ క్రాఫ్ చేయించుకోవాలి

**తెలుగు రైతు నియోజకవర్గ అధ్యక్షుడు కేలం ఇంద్రభూపాల్‌రెడ్డి**

**(షణ్ముఖ వెలుగు, వెలిగండ్ల, ఆగస్టు 7)**
రైతులు పండిస్తున్న పంటలకు ఈ క్రాఫ్ నమోదు చేసుకోవాలని




వ్యవసాయ సంచాలకులు షేక్ జైలులాబ్దిన్ అన్నారు. నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షుడు కేలం ఇంద్రభూపాల్‌రెడ్డి మాట్లాడుతూ రైతులకు మేలు రకమైన వంగడాలను అందజేయాలని కోరారు. గురువారం మండలంలోని మరపగుంట్ల గ్రామంలో రైతులకు యాజమాన్య పద్ధతులపై రైతు సేవ కేంద్రం వద్ద శిక్షణ ను ఇచ్చారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండిస్తున్న ప్రతి పంటకు ఈ క్రాఫ్ నమోదు చేసుకోవాలని అలాగే పంట బీమా నమోదు చేసుకోవాలని వ్యవసాయ శాఖ ద్వారా అమలులో ఉన్న పథకాలు విత్తనాలు ఎరువులు సరఫరా ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం కింద పంటల భీమా చేసుకునేందుకు ఆగస్టు 14వ తేదీ వరకు తొలగించినట్లు తెలిపారు . డాట్ శాస్త్రవేత్త సిహెచ్ ప్రసాద్ రైతులకు ఖరీఫ్ సీజన్లో సాగు చేసే కంది సజ్జా పత్తి తదితర పంటలకు సోకే తెగుళ్లు వాటి యొక్క నివారణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి తమ్మినేని శిల్ప, టిడిపి మండల అధ్యక్షులు ముత్తిరెడ్డి వెంకట్రెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షులు శ్రీనివాసులు రెడ్డి, మాజీ సర్పంచ్ ఒంగోలు శ్రీనివాసులు, ఏపీఎంఐపీ అధికారి ముత్తిరెడ్డి రామిరెడ్డి,మాజీ ఏఎంసీ డైరెక్టర్ రావూరి వెంకట రెడ్డి,వార్డ్ సభ్యులు మితికెల బాలయ్య వ్యవసాయ సిబ్బంది శీరీసా, అక్రమ్ గ్రామ రైతులు పాల్గొన్నారు.

# ప్రజా విశ్వాసం కోల్పోయిన ప్రభుత్వం

**ప్రజలను మోసగించడమే చంద్రబాబు నైజం**
**ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్**



**(షణ్ముఖ వెలుగు, పెద్దారవీడు, ఆగస్టు 7)**
చంద్రబాబు మోసాలపై క్యూఆర్ కోడ్ ప్రదరసిస్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 14 నెలల్లోనే ప్రజా విశ్వాసం కోల్పోయిందని ఎర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ అన్నారు. అలవికాని హామీలు ఇచ్చి ప్రజలను మోసగించడం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నైజం అన్నారు. గురువారం పెద్దారవీడు మండల కేంద్రంలో బాబు షూరిటీ మోసం గ్యారంటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు కూటమి ప్రభుత్వానికి ఎందుకు ఓటు వేసామా అని బాధపడుతున్నారని తెలిపారు. ప్రతిపక్షాలు వేధించడమే ప్రధాన ఉద్దేశంగా కోటను ప్రభుత్వం పనిచేస్తుందని వైఎస్ఆర్సిపి నాయకులు మాజీ ప్రజాప్రతినిధులపై అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారన్నారు. రాష్ట్రంలో పాలన పక్కదారి పట్టించి అభివృద్ధిని విస్మరించి రెడ్బుక్ రాజ్యాంగం అమలు చేస్తుందన్నారు. వైయస్ జగన్ ప్రభుత్వంలో విద్యకు వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇచ్చారని తెలిపారు. చంద్రబాబు ప్రభుత్వం విద్య వైద్య రంగాలను పూర్తిగా నిర్వీర్యం చేసే విధంగా వ్యహరిస్తుందని ఆరోపించారు. పశ్చిమ ప్రకాశం చిరకాల వాంఛైన శ్రీ సుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టును జాతికి అంకితం చేసిన ఘనత వైయస్ జగన్మోహన్ రెడ్డి అని గుర్తు చేశారు. రాబోయే ఎన్నికలలో అత్యధిక మెజారిటీతో ఎర్రగొండపాలెం గడ్డపై వైసీపీ జెండా ఎగరవేసి రాష్ట్రంలో వైఎస్ జగన్ ను ముఖ్యమంత్రిగా చేసుకోవాలని అన్నారు. కూటమి ప్రభుత్వం గెలిచి 14 నెలలు అవుతున్న ముంపు గ్రామ నిర్వాసితులకు ఆర్ఎన్ఆర్ ప్యాకేజీ కూడా ఇవ్వకపోవడం సిగ్గుచేటు అన్నారు. సంక్షేమాన్ని గాలికి వదిలేసి వైసీపీ నాయకులు కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించడం లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో పార్టీ నాయకులు కలిసికట్టుగా పనిచేసి వైఎస్ఆర్సిపి గెలిపే లక్ష్యంగా పనిచేయాలన్నారు. ప్రతి గ్రామంలో వైసీపీ నాయకులు ఇంటింటికి వెళ్లి చంద్రబాబు మోసాలను క్యూఆర్ కోడ్ ద్వారా తెలియజేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ పాలిరెడ్డి కృష్ణారెడ్డి. జడ్పిటిసి చలమారెడ్డి. సర్పంచులు దుగ్యం చెన్నమ్మ. వెంకట్‌రెడ్డి. ఆదినారాయణ యాదవ్. నాగరాజు, రాష్ట్ర మైనార్టీ నాయకులు షేక్ బుజ్జి, వెంకటరెడ్డి, మాజీ డీలర్ అల్లు వెంకటేశ్వర్‌రెడ్డి. మండల యూత్ కన్వీనర్ దినేష్. మాజీ ఎంపిటిసి చంద్రశేఖర్ సోషల్ మీడియా కన్వీనర్ నాగార్జునరెడ్డి. వెన్న పోల్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## మర్రిపూడి అంగన్వాడి కేంద్రంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు



(షణ్ముఖ వెలుగు, మర్రిపూడి, ఆగస్టు 7)
మండల కేంద్రమైన మర్రిపూడి సచివాలయం పరిధిలోని మర్రిపూడి ఓసి అంగన్వాడి కేంద్రంలో గురువారం చివరి రోజు సందర్భంగా తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ వారోత్సవాల్లో ముఖ్య అతిథిగా వైద్య అధికారి డాక్టర్ వీరబాబు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ గర్భవతిగా ఉన్న మహిళలు మంచి పోషకాహార విలువలు కలిగిన ఆహారం తీసుకుంటే పుట్టే బిడ్డ ఆరోగ్యంగా ఉంటుందన్నారు. పుట్టిన వెంటనే బిడ్డకు గంటలోపు ముర్రు పాలు పట్టించాలన్నారు, బిడ్డకు ఆరు నెలల వరకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని ఇతర ఏ ద్రవపదార్థాలు ఇవ్వకూడదని గర్భవతులకు సూచనలు ఇచ్చారు,ఈసందర్భంగా ఐస్ డిఎస్ సూపర్వైజర్ టి.విక్టోరియా రాణి మాట్లాడుతూ తల్లి బిడ్డకు పాలు ఇవ్వడం వల్ల రొమ్ము క్యాన్సర్ రాకుండా నివారించవచ్చని ఆమె తల్లులకు సూచనలు ఇచ్చారు. ప్రతి కాన్పుకు రెండు సంవత్సరాలు వ్యవధి ఉండాలన్నారు,ఈకార్యక్రమంలో సి హెచ్ ఓ ఎల్.నాగేశ్వరరావు, అంగన్వాడి కార్యకర్తలు కెపి హైమావతి, ఏ. సుధేష్ణ,కామేశ్వరి, కేజీ అమ్మ, గ్రేస్ అమ్మ, ప్రభావతి, ఆశా వర్కర్లు, తల్లులు, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ అంకమ్మ తల్లి అమ్మవారికి రూ.25 వేల విరాళం

### అందజేసిన చిన్నారి హాస్పిటల్ డాక్టర్ ఇంద్రాణి



(షణ్ముఖ వెలుగు, కందుకూరు, ఆగస్టు 7)
కందుకూరు గ్రామ దేవత ఆదిపరాశక్తి శ్రీశ్రీశ్రీ అంకమ్మ తల్లి అమ్మవారి అనివేటి మండపం నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. అనివేటి మండప నిర్మాణానికి భక్తులు తమ వంతు విరాళాలను అందజేస్తున్నారు. గురువారం కందుకూరు పట్టణంలోని చిన్నారి హాస్పిటల్ డాక్టర్లు డాక్టర్ మహేష్ రెడ్డి, డాక్టర్ ఇంద్రాణి దంపతుల కుమారులు గోళ్ళమూడి వెంకట పణి అభిరామిరెడ్డి, గొల్లమూడి వెంకట ధీరజ్ రామ్‌రెడ్డిల పేరు మీద రూ.25వేలు అమ్మవారికి కానుకగా ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు కొడాలి కోటేశ్వరరావుకు అందజేశారు. అమ్మవారి ఆశీస్సులు వారికి వారి కుటుంబ సభ్యులకు ఎల్లవేళలా ఉండాలని ఆలయ కమిటీ సభ్యులు ఆకాంక్షించారు.

## అసాంఘిక కార్యకలాపాల కట్టడికి ఎన్‌ఫోర్స్‌మెంట్

### ముమ్మరం చేసిన ప్రకాశం జిల్లా పోలీసులు
### పేకాట స్థావరం పై మెరుపు దాడులు
### ఐదుగురు జూదరులు అరెస్ట్



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 7)
జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్ ఆదేశాల మేరకు పలు పోలీస్ స్టేషన్ల పరిధిలో అసాంఘిక కార్యకలాపాలపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. ఈ క్రమంలో త్రిపురాంతకం పోలీస్ స్టేషన్ పరిధిలోని కొత్తముడివేముల గ్రామ శివారులో గురువారం ఎస్సై శివబసవరాజు, వారి సిబ్బంది పేకాట స్థావరంపై ఆకస్మికంగా దాడులు నిర్వహించి పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి ఐదు మోటార్ సైకిళ్లు, ఆరు సెల్ ఫోన్లు మరియు రూ.1,02,150 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్‌లో భాగంగా జూద క్రీడలు మరియు ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. అలాగే, జిల్లాలో ఎక్కడైనా ఇలాంటి కార్యక్రమాలకు సంబంధించి సమాచారం ఉంటే, వెంటనే డయల్ 112 నంబర్‌కు లేదా పోలీసు వాట్సాప్ నంబర్ 9121102266కు మెసేజ్ ద్వారా తెలియజేయాలని ప్రజలను కోరారు.

# డెంగ్యూ వ్యాధి వ్యాప్తిని పూర్తి స్థాయిలో అరికట్టాలి

### జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి













(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, బాపట్ల, ఆగస్టు 7)
డెంగ్యూ వ్యాధి వ్యాప్తిని పూర్తిస్థాయిలో అరికట్టాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. డెంగ్యూ కేసులు నమోదైన చెరుకుపల్లి, నిజాంపట్నం, నగరం మండలాలలోని ముత్తుపల్లి, నగరం, గొళ్ళపల్లి, ఈదుపల్లి ప్రాంతాలలో కలెక్టర్ గురువారం విస్తృతంగా పర్యటించారు. ఆ గ్రామాలలో పారిశుద్ధ్య కార్యక్రమాల నిర్వహణ, ఫీవర్ సర్వేను ఆకస్మికంగా పరిశీలించారు. వైద్య శిబిరాల నిర్వహణ, సేవలపై క్షేత్ర స్థాయిలో పరిశీలించి స్వయంగా తీసుకున్నారు. జ్వరాలతో బాధపడుతున్న ప్రజలను పరామర్శించారు. ఆ గ్రామంలోని ప్రజల ఇళ్లలోకి వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మరుగునీరు, వర్షం నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని సూచనలు చేశారు. వారి ఇంట్లో మురుగు నీరు బయటకు వెళ్లే మార్గాలను పరిశీలించారు. జ్వరంతో బాధపడుతున్న వారికి వైద్యం అందిస్తున్న తీరును స్వయంగా తెలుసుకున్నారు. ముత్తుపల్లి ఎస్సీ కాలనీలో ఎం ఎమేల్యమ్మ జ్వరంతో బాధపడుతుండగా ఆమెకు అందిన వైద్యంపై ఆరా తీశారు. జ్వరంతో ఉన్న ఎం సునీతకు ప్లేట్లెట్లు 1.50 లక్షల నుంచి 96 వేలకు తగ్గిపోవడంతో తక్షణమే వైద్యశాలకు తరలించాలని వైద్యాధికారులను ఆదేశించారు. మాణిక్యమ్మ ఇంటి ఆవరణలో మరుగునీరు ఉండడంపై నిలదీశారు. ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. మీరంతా పరిశుభ్రంగా ఉంటూ ముందస్తు జాగ్రత్తలు పాటిస్తే ఎలాంటి ఇబ్బంది ఉండదని వారికి సూచించారు. డెంగ్యూ కేసులు నమోదైన చోట యుద్ధ ప్రాతిపదికన వైద్య సేవలు అందిస్తూనే, మరోవైపు ర్యాపిడ్ కిట్లతో పరీక్షలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ముత్తుపల్లి గ్రామం ప్రధాన రహదారి వద్ద అధికంగా చెత్త నిల్వ ఉండడం, దుర్గంధం వెదజల్లుతున్నప్పటికీ తొలగించకపోవడంతో కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సంబంధిత గ్రామ కార్యదర్శిని తక్షణమే సస్పెండ్ చేస్తున్నట్టు తెలిపారు. పారిశుధ్య కార్యక్రమాలు పక్కాగా చేపట్టాలని ఆదేశించారు. అనంతరం నగరంలోని ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈదుపల్లి, తాడివారిపల్లిపాలెం, ముత్తుపల్లి గ్రామాలలో సాధారణ జ్వరంతో బాధపడుతూ వైద్యశాలలో 40 మంది వైద్యం పొందుతున్నట్లు తెలుసుకున్నారు. ఒక్కొక్కరి వద్దకు వెళ్లి ఆరోగ్య పరిస్థితిని, వైద్యం అందిస్తున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. జిల్లా యంత్రాంగమంతా మీ కొరకే పని చేస్తుందని, ప్రభుత్వం మీకు అండగా ఉంటుందని కలెక్టర్ భరోసా ఇచ్చారు. తక్షణమే కోలుకొని ఆరోగ్యంతో ఇంటికి వెళ్తారన్నారు. డెంగ్యూ అనుమానిత కేసులతో వైద్యం పొందుతున్న వారిని సైతం కలిసి ధైర్య పరిచారు. జ్వరంతో బాధపడుతున్న రోగులందరికీ మెరుగైన వైద్యం అందించాలని కలెక్టర్ వెంకట మురళి చెప్పారు. రోగులను పరామర్శించిన తదుపరి వైద్య అధికారులతో మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా 170 ర్యాపిడ్ టెస్టులు చేశామని, ఎనిమిది మందికి డెంగ్యూ ఉన్నట్లు నిర్ధారించామన్నారు. వారందరికీ మెరుగైన వైద్యం అందిస్తున్నామన్నారు. ఒక కేసు నమోదైన ప్రాంతము నుండి అర కిలోమీటర్ వరకు పూర్తిస్థాయిలో దోమల ఉత్పత్తి అరికట్టడం, లార్వా నిర్మూలన, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. తాగునీరు కలుషితం లేకుండా అన్ని జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. ఆ ప్రాంతాలలో తక్షణమే వైద్య సేవలు, జిల్లా వ్యాప్తంగా ఫీవర్ సర్వే నిర్వహిస్తున్నామన్నారు. వైద్య సహాయక చర్యలపై ఆరా తీశారు. రోగుల పట్ల ఆప్యాయంగా, శ్రద్ధ వహించాలన్నారు. జ్వరాలు తగ్గేవరకు ఇలాంటి క్లిష్టమైన పరిస్థితిగా భావించి డాక్టర్లు, నర్సులు, సిబ్బంది రాత్రి, పగళ్ళు కష్టపడి పనిచేయాలన్నారు. మీ శక్తి సామర్థ్యాలు చూపించే సమయములో నిర్లిప్తంగా ఉండరాదన్నారు. అపోహలన్నీ తొలిగేలా ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత మీ పైనే ఉందన్నారు. వైద్యశాలలో 30 పడకలే ఉండగా 40 మందికి పైగా రోగులు వైద్యం పొందుతున్నారని డాక్టర్లు చెప్పడంతో తక్షణమే బెడ్లను ఏర్పాటు చేయాలని జిల్లా వైద్యాధికారిని ఆదేశించారు. జ్వరాలు ప్రభలకుండా దోమల నియంత్రణకు యంత్రాంగం పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట జిల్లా వైద్యాధికారిని డాక్టర్ ఎస్ విజయమ్మ, డిపిఓ ప్రభాకర్ రావు, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ అనంతరాజు, వివిధ శాఖల అధికారులు, తదితరులు ఉన్నారు.

## సమగ్ర పంటల యాజమాన్య పద్ధతులపై శిక్షణ





(షణ్ముఖ వెలుగు, పొదిలి, ఆగస్టు 7)
మండలంలోని అక్కచెరువు ఆత్మ ఆధ్వర్యంలో 2025 ఖరీఫ్ సీజన్ నందు సాగు చేసే పంటలలో చేపట్టవలసిన సమగ్ర పంటల యాజమాన్య పద్ధతులపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం,దర్శి ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డాక్టర్ జి రమేష్, సేద్య విభాగం శాస్త్రవేత్త, డాక్టర్ టి వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా ఎరువుల యాజమాన్యం, కంది, సజ్జ, మినుములు, అలసంద పంటలలో విత్తనం వేసే దగ్గర నుండి పంట కోత వరకు చేపట్టవలసిన మేలైన యాజమాన్య పద్ధతుల గురించి, జీవన ఎరువుల ప్రాముఖ్యత గురించి వివరించారు. మండల వ్యవసాయాదికారి దేవిరెడ్డి శ్రీనివాసులు మాట్లాడుతూ వ్యవసాయ శాఖ నందు అమలులో ఉన్న పథకాలు, విత్తన, ఎరువులు సరఫరా, ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద పంటల బీమా చేసుకొనుటకు 14.8.2025 వరకు పొడిగించడం అయినదని మొదలైన అంశాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో బీటీఎం నాగభూశనం, గ్రామ వ్యవసాయ సహాయకులు గురు బ్రహ్మం, రైతులు పాల్గొన్నారు.

## గంజాయి దొంగలను గుర్తించాం త్వరలో పట్టుకుంటాం

### మాదకద్రవ్యాలు సేవిస్తే అంతే
### నేర నియంత్రణ అదుపులోనే ఉంది
### వ్యాపారస్తులు వారిషాపుల వద్ద పార్కింగ్ వారిదే బాధ్యత
### ట్రాఫిక్ కు ఇబ్బంది కలిగిస్తే ఉపేక్షంచం
### పొదిలిలో గంజాయి పై ప్రత్యేక దృష్టి
### మీడియాతో పొదిలి ఎస్ఐ వి వేమన




(షణ్ముఖ వెలుగు, పొదిలి, ఆగస్టు 7)
పొదిలి ప్రాంతంలో గంజాయి అమ్మేవారు, సరఫరా చేసేవారిని గుర్తించడం జరిగిందని వారి పై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని, త్వరలోనే అరెస్టులు చేస్తామని ఎస్ఐ వి వేమన తెలిపారు. గురువారం ఆయనను కలిసిన మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. మాదకద్రవ్యాలు సేవించిన, విక్రయించినా పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు. చట్టవ్యతిరేకంగా ఎవరు ప్రవర్తించినా ఉపేక్షేందిలేదని హెచ్చరించారు. ప్రధాన రహదారి పై ట్రాఫిక్ కు అంతరాయం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. వినియెగదారుల పార్కింగ్ సదరు షాపు యజమానులదే బాధ్యత అని తెలిపారు. నేరాలు నియంత్రణలో ఉన్నాయన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్, ఆటోలలో పరిమితికి మించి ప్రయాణం వంటి వాటి పై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు ఆయన తెలిపారు.


On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com